చంద్రబాబును కలిసిన ఎంపీ



ఢిల్లీ పర్యటనకు వెళ్లి సీఎం నారా చంద్రబాబు నాయుడును బుధవారం రాత్రి కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు కలిశారు. ఈ సందర్భంగా సహచర ఎంపీలతో కలసి చంద్రబాబుకు పుష్ప గుచ్ఛాలు అందజేసి స్వాగతం పలికారు.

- కర్నూలు అర్బన్



శ్రీశైలం జలాశయంలో గేట్లకు దిగువ భాగాన ఉన్న నీరు

ఏటా ఖరీఫ్ సీజన్‌లో నిండుకుండలను తలపించే జలాశయాలు నీరు లేక వెలవెలబోతున్నాయి. ప్రమాదకర స్థాయికి నీటి నిల్వలు పడిపోయాయి. నైరుతి రుతిపవనాలు ఆశాజనకంగా ప్రవేశించినా.. ఆ తరువాత మేఘాలు దోబూచులాడుతున్నాయి. రాయలసీమ జిల్లాలకు ప్రాణాధారమైన కృష్ణా, తుంగభద్ర నదులకు వరద జాడ లేదు. కరువు పల్లెసీమలకు సాగు, తాగునీటికి కీలకమైన కృష్ణా, తుంగభద్ర జలాశయాలు అడుగంటాయి. ఈ జలాశయాలకు ఈ ఏడాది ఇప్పటి వరకు ఆశాజనంగా వరద చేరలేదు. జూలైలో అడుగు పెడుతున్నా.. సీమ పల్లెసీమలకు జీవనాడులైన శ్రీశైలం, తుంగభద్ర జలాశయాల్లో ప్రమాద ఘంటికలు మోగుతున్నాయి. వరద నీరు చేరకపోవడంతో రైతుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది.

జలాశయాలు వెలవెల..!

- వర్షాకాలం సీజన్ ప్రారంభమైనా కృష్ణా, తుంగభద్ర నదుల్లో కానిరాని వరద
- అడుగంటిన శ్రీశైలం, తుంగభద్ర జలాశయాలు
- పల్లెసీమల్లో తాగునీటికి తప్పని అవస్థలు
- రాయలసీమ అన్నదాతల్లో ఆందోళన

కర్నూలు, జూలై 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో సాగు, తాగునీటి ప్రయోజనాలను కాపాడే ప్రధాన జలాశయాలు శ్రీశైలం, తుంగభద్ర, నాగార్జునసాగర్, పులచింతల, ప్రకాశం బ్యారేజీ జలాశయాల నీటి నిల్వ సామర్థ్యం 682.49 టీఎంసీలు. ఆదివారం నాటికి ఆయా డ్యాంలో ఉన్న నీటి నిల్వలు 168.32 టీఎంసీలే. 514.17 టీఎంసీలు ఖాళీగా ఉన్నాయి. గత ఏడాది ఇదే సమయంలో 217.88 టీఎంసీలు ఉన్నాయి. ఈ లెక్కన చూసినా 49.54 టీఎంసీలు తక్కువగానే ఉన్నాయి. రాష్ట్రంలో వివిధ జిల్లాల్లో చిన్నా పెద్ద జలాశయాల సామర్థ్యం 441.66 టీఎంసీలు కాగా ప్రస్తుతం 71.36 టీఎంసీలే ఉన్నాయి. అందులో డెడ్ స్టోరేజీ పోనూ 41.64 టీఎంసీలే వినియోగించుకునే అవకాశం (లైవ్ స్టోరేజ్ కెపాసిటీ) ఉందని ఇంజనీర్లు అంటున్నారు. గతేడాది ఇదే సమయంలో 195.09 టీఎంసీలు నిల్వ ఉండేది. జూన్ ఒకటో తారీఖు నుంచి మే 31 వరకు ఒక నీటి సంవత్సరంగా పరిగణిస్తారు. వర్షాకాలం సీజన్ ప్రారంభంకాగానే ప్రాజెక్టుల్లోకి వరద మొదలవుతుంది. ఆయా ప్రాజెక్టుల ఆధారంగా పంట కాలువ కింద ఆయకట్టు రైతులు జూలై మొదటి వారంలో వరి నారు పెంచేందుకు సర్వం సిద్ధం అవుతారు. అయితే.. ఈ ఏడాది జలాశయాలకు వరద మొదలే కాకపోవడం.. వేసవి పరిస్థితులను తలపిస్తుండడం.. ముఖ్యంగా రాయలసీమ జిల్లాల్లో వెలవెలబోతున్న తుంగభద్ర, శ్రీశైలం జలాశయాలను చూసిన మట్టిమనుషులు ఆందోళన చెందుతున్నారు.

సీమలో ఇది పరిస్థితి

రాయలసీమ జిల్లాల్లో జలాశయాలు అడుగంటడంతో తాగునీటిపై తీవ్ర ప్రభావం చూపుతుంది. కర్నూలు జిల్లాలో 7.077 టీఎంసీలు సామర్థ్యం కలిగిన నాలుగు (గాజులదిన్నె ప్రాజెక్టు, సుంకేసుల బ్యారేజ్, కృష్ణగిరి, పత్తికొండ) జలాశయాలు ఉన్నాయి. ఆదివారం ఉన్న నీరు 2.973 టీఎంసీలే. నంద్యాల జిల్లాలో 37.163 టీఎంసీలు సామర్థ్యం కలిగిన ఆరు జలాశయాలు (గోరుకల్లు, అవుకు, వెలుగోడు, వరదరాజస్వామి ప్రాజెక్టు, జుర్రేరు, అలగరూరు బ్యాలెన్సింగ్ రిజర్వాయరు) ఉంటే.. నీటి నిల్వ 3.955 టీఎంసీలే. కడప జిల్లాలో 77 టీఎంసీలు సామర్థ్యం కలిగిన 11 రిజర్వాయర్లు ఉంటే ఉన్నాయి. గతేడాది ఇదే సమయంలో 48.584 టీఎంసీలు ఉంటే ప్రస్తుతం 13.545 టీఎంసీలే ఉన్నాయి. అనంతపురం జిల్లాలో 12.563 టీఎంసీల సామర్థ్యం కలిగిన ఐదు జలాశయాలు ఉంటే ప్రస్తుతం 2.033 టీఎంసీలు మాత్రమే ఉన్నాయి. సత్యసాయి జిల్లాలో 16.071 టీఎంసీలు సామర్థ్యం కలిగిన ఆరు జలాశయాలు ఉంటే తాజాగా 1.581 టీఎంసీలు, అన్నమయ్య జిల్లాలో 8.165 టీఎంసీలు సామర్థ్యంతో ఐదు జలాశయాలు ఉంటే ప్రస్తుతం 3.128 టీఎంసీలే ఉన్నాయి. తిరుపతి జిల్లాలో 3.038 టీఎంసీలు సామర్థ్యం కలిగిన నాలుగు జలాశయాలు ఉంటే.. ఆదివారం నాటికి ఉన్న నీటి నిల్వలు 1.060 టీఎంసీలే. రాష్ట్ర వ్యాప్తంగా ఇదే పరిస్థితి ఉంది. 15-16 శాతం కూడా నీటి నిల్వలు లేకపోవడం చూస్తే కష్టజీవులకు కన్నీటి కష్టాలు తప్పవా..? అని సాగునీటి నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా తాగునీటిపై ప్రభావం చూపే అవకాశాలు కనిపిస్తున్నాయి.

సీమ కరువు క'న్నీటి' కష్టాలు తీరేనా..?

ఉమ్మడి కర్నూలు, అనంతపురం జిల్లాలకు జీవనాడి అయిన తుంగభద్ర జలాశయంలో ప్రమాద ఘంటికలు మోగుతున్నాయి. నీటి నిల్వ సామర్థ్యం 105.788 టీఎంసీలు. అయితే.. టూ ఫిల్లింగ్ ఆధారంగా ఒక నీటి సంవత్సరంలో 212 టీఎంసీల వరదను వినియోగించుకునేలా ప్రాజెక్టు డిజైన్ చేశారు. ఆ మేరకు ఆంధ్రప్రదేశ్‌లో తుంగభద్ర దిగువ కాలువ (ఎల్లెల్సీ), ఎగువ కాలువ (హెచ్చెల్సీ) సహా కర్ణాటక కాలువలు, తెలంగాణలో ఆర్డీఎస్ కాలువకు కృష్ణా వాటర్ డిస్ప్యూట్ ట్రిబ్యునల్-1 (కేడబ్ల్యుడీటీ) బచావత్ అవార్డు ప్రకారం కేటాయింపులు చేశారు. ప్రతి యేడాది మే నెలలో టీబీపీ బోర్డు వాటర్ రివ్యూ కమిటీ సమావేశమైన ఆ నీటి సంవత్సరంలో డ్యాంలో చేరే వరదను అంచనా వేస్తారు. అందులో భాగంగానే ఈ ఏడాది (2024-24 నీటి సంవత్సరం) 172 టీఎంసీలు వరద చేరే అవకాశం ఉందని అంచనా వేశారు. కర్నూలు జిల్లాలో ఎల్లెల్సీకి 24 టీఎంసీలకు గానూ 19.472 టీఎంసీలు, కేసీ కాలువకు 10 టీఎంసీలకు గానూ 8.113 టీఎంసీలు, అనంతపురం జిల్లాలో హెచ్ఎల్సీకి 35.50 టీఎంసీలకు గానూ 26.368 టీఎంసీలు కేటాయించారు. డ్యాంలో వరద చేరికను బట్టి జూలై 15న కాలువలకు సాగునీరు విడుదల చేసేలా జూన్ 7న జరిగిన టీబీపీ బోర్డు వాటర్ రివ్యూ కమిటీలో తీర్మానం చేశారు. ప్రస్తుతం తుంగభద్రలో 105.79 టీఎంసీలకు గానూ 5.79 టీఎంసీలే నిల్వ ఉన్నాయి. ఆయకట్టు రైతులు ఆందోళన చెందుతున్నారు. అనుకున్న సమయానికి తగినంత వరద రాకపోతే తాగు, సాగునీటిపై ప్రతికూల ప్రభావం పడుతుందని సీమ సాగునీటి నిపుణులు పేర్కొంటున్నారు.

అడుగంటిన శ్రీశైలం

శ్రీశైలం జలాశయం నీటి నిల్వలు అత్యంత దయనీయ స్థితికి చేరుకున్నాయి. డ్యాం గరిష్ట నీటి మట్టం 885 అడుగులు.. గరిష్ట నీటి నిల్వ సామర్థ్యం 215.810 టీఎంసీలు. అయితే.. ప్రస్తుతం 37.35 టీఎంసీలు మాత్రమే నిల్వ ఉన్నాయి. వర్షాకాలం సీజన్ ఆరంభమైనా ఎగువన కర్ణాటక, మహారాష్ట్ర ప్రాంతాల్లో వర్షాలు కురవకపోవడం వల్ల డ్యాంకు వరద మొదలు కాలేదు. ఖరీఫ్ ప్రారంభంలో నైరుతి రుతుపవనాలు ఆలస్యమై సకాలంలో వర్షాలు పడకపోయినా, దుర్భిక్ష పరిస్థితులు తలెత్తితే ప్రజలకు కనీస తాగునీటి అవసరాలు తీర్చేందుకు, నారుమడులకు నీటి విడుదల కోసం నీటి సంవత్సరం చివరలో (మే నెల) క్యారీ ఓవర్ కింద శ్రీశైలం జలాశయంలో కనీస నీటి మట్టం 854 అడుగులకు తగ్గకుండా క్యారీ ఓవర్ కింద 60 టీఎంసీలు నిల్వ ఉంచాలని నిపుణులు సూచిస్తున్నారు. తాజా పరిస్థితిపై సీమ రైతుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. ఇదే సమయంలో గతేడాది 33.44 టీఎంసీల నీరు నిల్వ ఉండేదని ఇంజనీర్లు తెలిపారు.



సంగమేశ్వరం వద్ద ఇలా..



తుంగభద్ర జలాశయం

సాగునీటి ప్రాజెక్టులపై కలెక్టర్ సమీక్ష



ఇరిగేషన్ అధికారులతో ప్రాజెక్టులపై సమీక్షిస్తున్న కలెక్టరు

కర్నూలు, జూలై 3 (ఆంధ్రజ్యోతి)/ కర్నూలు కలెక్టరేట్: 'జిల్లాలో ఉన్న సాగునీటి ప్రాజెక్టుల వారిగా ఎలాంటి సమస్యలు ఉన్నాయి. నిధులు, ప్రభుత్వ అనుమతులు ఉన్నాయా..? అంతర్ రాష్ట్ర సమస్యలు ఉన్న ప్రాజెక్టులు ఏవీ..? సమగ్ర వివరాలతో కూడిన నివేదికలతో రండి' అంటూ జిల్లా కలెక్టర్ ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. బుధవారం జిల్లా సాగునీటి ప్రాజెక్టు, గ్రామీణ తాగునీటి విభాగం (ఆర్‌డబ్ల్యూఎస్) అధికారులతో జిల్లా కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇరిగేషన్ కర్నూలు సర్కిల్ ఇన్‌చార్జి (ఎఫ్ఏసీ) ఎస్ఈ రెడ్డిశేఖర్‌రెడ్డి జిల్లాలోని ప్రాజెక్టుల గురించి వివరించారు. ఎల్లెల్సీ ద్వారా జిల్లాలో 1,51,134 ఎకరాలకు సాగునీరు, 194 గ్రామాలకు తాగునీరు ఇస్తున్నామని వివరించారు. టీబీపీ ఎల్లెల్సీ, ఆలూరు బ్రాంచి కెనాల్, కేసీ కాలువ, హంద్రీనీవా కాలువ, సుంకేసుల జలాశయం, గాజులదిన్నె ప్రాజెక్టు సహా గత వైసీపీ ప్రభుత్వం అసంపూర్తిగా వదిలేసిన వేదవతి ప్రాజెక్టు, ఆర్డీఎస్ కుడి కాలువ ప్రాజెక్టుల గుర్తించి కలెక్టరు అడిగి తెలుసుకున్నారు. గూగుల్ మ్యాప్ ద్వారా వాటిని పరిశీలించారు. ఆయా ప్రాజెక్టు తాజా పరిస్థితులపై ఇంజనీర్లు వివరించారు. ఈ సందర్భంగా కలెక్టరు రంజిత్‌బాషా మాట్లాడుతూ 'సంక్షిప్త సమాచారం కాదు.. సమగ్ర వివరాలతో పూర్తి నివేదికలు కావాలని, తక్షణమే నివేదికలు తయారు చేయాలని' ఆదేశించారు. త్వరలోనే ఐఏబీ సమావేశం ఏర్పాటు చేసేందుకు సన్నాహాలు చేయాలని సూచించారు. అదే క్రమంలో ఏ గ్రామంలో కూడా తాగునీటి సమస్య రాకుండా చూడాలని, ఇరిగేషన్, ఆర్‌డబ్ల్యూస్ ఇంజనీర్లు సమన్వయంతో పని చేస్తే గ్రామాల్లో తాగునీటి సమస్యలే రావని అన్నారు. అదే క్రమంలో తాగునీటి పథకాలు, ఇరిగేషన్ సోర్స్ వివరాలు, మ్యాప్‌లతో నివేదికలు తయారు చేయాలని ఆ శాఖ ఇంజనీర్లను ఆదేశించారు. ఈ సమావేశంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ నాగేశ్వర రావు పాల్గొన్నారు.

ఉప లోకాయుక్త ఆదేశాలతో ఒంగోలు మున్సిపల్ అధికారులపై చర్యలు



కర్నూలు(లీగల్), జూలై 3: నిబంధనలకు విరుద్ధంగా కొన్ని బిల్డింగ్ ప్లాన్ అప్రూవల్స్‌ను అక్రమంగా ఆమోదించారనే ఫిర్యాదుపై రాష్ట్ర ఉప లోకాయుక్త ఆదేశాలతో అధికారులు చర్యలు తీసుకున్నారు. లోకాయుక్త ఆదేశాలతో రాష్ట్ర ప్రభుత్వం ఒంగోలుకు చెందిన ఇద్దరు మున్సిపల్ అధికారులపై చర్యలు తీసుకుంది. ఒంగోలు మున్సిపల్ అధికారులు నిబంధనలను ఖాతరు చేయకుండా అక్రమంగా కొన్ని బిల్డింగ్ ప్లాన్‌లను ఆమోదించారంటూ ఒంగోలు చెందిన ఒక మాజీ సైనిక ఉద్యోగి పత్తిపాటి రామమూర్తి 2016లో రాష్ట్ర ఉప లోకాయుక్తకు ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదుపై స్పందించిన ఉప లోకాయుక్త వెంటనే విచారించి తుది నివేదికను దాఖలు చేయాలని రాష్ట్ర మున్సిపల్ అధికారులకు గతంలో ఆదేశించింది. దీంతో రాష్ట్ర స్థాయి మున్సిపల్ అధికారులు విచారించి బిల్డింగ్ ప్లాన్‌లను ఆమోదించడంలో బాధ్యులైన విశ్రాంత సీడీపీవో జి.శేషాచారీ, ఇన్‌చార్జి సీపీడీవో ఎం.నారాయణరావులపై శాఖాపరమైన చర్యలకు సిఫారసు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం వీటిపై ఒక వార్షిక ఇంక్రిమెంటుతో పాటు మూడు సంవత్సరాల పాటు వీరి పెన్షన్‌లో రెండున్నర శాతం కోత విధించింది. అధికారుల చర్యలతో ఫిర్యాదును ముగిస్తూ రాష్ట్ర ఉప లోకాయుక్త పి.రజని బుధవారం ఆదేశాలు జారీ చేశారు.

● తహసీల్దార్, సబ్ రిజిస్ట్రార్ల ఇంక్రిమెంటు కట్

నిబంధనలకు విరుద్ధంగా ప్రభుత్వ డాక్యుమెంట్లను, వెబ్‌ల్యాండ్ వివరాలను అప్పటి కృష్ణా జిల్లా గన్నవరం తహసీల్దార్, సబ్ రిజిస్ట్రార్లు మార్పులు చేర్పులు చేశారనే ఫిర్యాదులపై రాష్ట్ర ప్రభుత్వం ఇద్దరి ఇంక్రిమెంట్లలో కోత విధించినట్లు ఉప లోకాయుక్తకు తెలిపింది. అప్పటి గన్నవరం తహసీల్దార్ ములుగు మాధురి, సబ్ రిజిస్ట్రార్ బి..సాయికృష్ణారెడ్డిలపై గన్నవరం చెందిన మాజీ సైనికోద్యోగి ముప్పనేని రవికుమార్ రాష్ట్ర ఉప లోకాయుక్తకు 2016లో ఫిర్యాదు చేశారు. దీంతో ఈ ఫిర్యాదిపై విచారించి తగు చర్యలు తీసుకోవాలని ఉప లోకాయుక్త రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ అధికారులు విచారించి అక్రమాలకు పాల్పడిన తహసీల్దార్ ములుగు మాధురికి రెండు ఇంక్రిమెంట్లు, సబ్ రిజిస్ట్రార్ బి.సాయికృష్ణారెడ్డికి ఒక ఇంక్రిమెంటును ఒక ఏడాదిపాటు కోత విధించినట్లు ఉప లోకాయుక్తకు తెలిపింది.

పంచాయితీలకు నిధులు మంజూరు

కర్నూలు(కలెక్టరేట్), జూలై 3: జిల్లాలోని పంచాయితీలకు ప్రభుత్వం నిధులను మంజూరు చేసిందని జిల్లా పంచాయితీ అధికారి నాగరాజు నాయుడు తెలిపారు. రెండు రోజుల్లోపు గ్రామ పంచాయితీలకు నిధులు జమ కానున్నట్లు తెలిపారు. వృత్తి పన్ను కింద రూ.35,72,827, తలసరి గ్రాంట్ కింద రూ.20,52,426, సర్పంచ్ జీతభత్యాల కింద రూ.82,25,000 మంజూరయ్యాయని తెలిపారు.

డిజిటల్ అసిస్టెంట్ సస్పెన్షన్

కర్నూలు(కలెక్టరేట్), జూలై 3: వెల్దుర్తి గ్రామ సచివాలయం-1లో డిజిటల్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న రాఘవేంద్రరెడ్డిని సస్పెండ్ చేస్తూ బుధవారం జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌భాషా ఉత్తర్వులు జారీ చేశారు. పింఛన్‌దారులతో వేలిముద్రలు తీసుకుని డబ్బులు ఇవ్వడం లేదని లబ్ధిదారులు ఫిర్యాదు చేశారు. ఆ ఫిర్యాదుపై జిల్లా పంచాయితీ అధికారి నాగరాజునాయుడు సంబంధిత అధికారిపై విచారణ చేపట్టారు. విచారణలో డిజిటల్ అసిస్టెంట్ రాఘవేంద్రరెడ్డి పింఛన్ డబ్బు ఇవ్వలేదని వెల్లడైంది. దీంతో విధుల పట్ల నిర్లక్ష్యం కారణంగా ఆయన్ను సస్పెండ్ చేస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు.

నేడు విద్యాసంస్థల బంద్

కర్నూలు(ఎడ్యుకేషన్), జూలై 3: నీట్, యుజీసీ నెట్ పరీక్ష ప్రశ్నపత్రం లీకేజీని నిరసిస్తూ గురువారం విద్యాసంస్థల బంద్‌కు విద్యార్థిసంఘాల నాయకులు పిలుపునిచ్చారు. కేజీ నుంచి పీజీ వరకు విద్యాసంస్థలన్నీ స్వచ్ఛందంగా బంద్ పాటించాలని ఏఐఎస్ఎఫ్, ఎస్ఎఫ్ఐ, పీడీఎస్‌యూ, ఏఐఎస్‌ఏ, ఎన్ఎస్‌యుఐ, విద్యార్థి సంఘాలు బుధవారం పిలుపునిచ్చాయి. విద్యార్థి సంఘాల నాయకులు అబ్దుల్లా, సోమన్న, వీరేష్ యాదవ్, రంగప్ప, రమణ, పవన్ మాట్లాడుతూ ఒన్ నేషన్.. వన్ ఎగ్జామ్ ముసుగులో మొత్తం పరీక్ష వ్యవస్థ కుప్పకూలిపోయిందని ఆరోపించారు. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ పరీక్షలు నిర్వహించడంలో కేంద్ర ప్రభుత్వం ఘోరంగా విఫలమైందన్నారు. అలాగే విద్యాసంస్థల్లో నెలకొన్న అనేక సమస్యలను పరిష్కరించాలని దేశవ్యాప్త బంద్‌కు పిలుపునిచ్చామన్నారు.

మ్మెల్యే పార్థసారథి సమక్షంలో బీజేపీలో చేరిన వైసీపీ నాయకులు



ఆదోనిలో వైసీపీకి షాక్

- బీజేపీలోకి ముగ్గురు కౌన్సిలర్లు, ఎంపీపీ
- ఎమ్మెల్యే పార్థసారథి సమక్షంలో చేరిక



ఆదోని, జూలై 3: సార్వత్రిక ఎన్నికల్లో ఎన్డీయే కూటమి జయభేరి మోగించిన అనంతరం ఆదోనిలో వైసీపీ గడ్డు పరిస్థితిని ఎదుర్కొంటోంది. తాజాగా బుధవారం ఆదోని లో వైసీపీకి చెందిన ముగ్గురు మున్సిపల్ కౌన్సిలర్లతో పాటు ఎంపీపీ బడాయి దానమ్మ ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి సమక్షంలో బీజేపీలో చేరారు. బీజేపీలోకి చేరిన వారిలో 35వ వార్డు అమరావతినగర్ కౌన్సిలర్ లలిత, 18,13 వార్డుల కౌన్సిలర్లు చిన్న, పద్మావతి, సంతెకూడ్లూరు, ధనాపురం సర్పంచులు ధనలక్ష్మీ, చంద్రశేఖర్, ఎంపీటీసీ కమలమ్మ, కుప్పగల్, పెద్దతుంబళం ఉప సర్పంచులు తాయప్ప, తిక్కయ్య తదితరులు ఉన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పార్థసారథి మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలన్నీ నెరవేరుస్తామన్నారు. ఆదోని అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు వెల్లాల మధుసూదన్ శర్మ, ప్రభాకర్, గోన ఆది, మధు, మాధవ్, కల్లుపోతుల సురేష్ పాల్గొన్నారు.

కుల ధ్రువీకరణను పూర్తి చేయండి

- తహసీల్దార్లు, వీఆర్వోలకు జేసీ ఆదేశం



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న జేసీ నారపురెడ్డి మౌర్య

కర్నూలు(కలెక్టరేట్), జూలై 3: కులధ్రువీకరణ దరఖాస్తులను 15 రోజుల్లో పూర్తి చేసి, రెవెన్యూ సర్వీసెస్ సమస్యలను గడువులోగా పరిష్కరించాలని జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య తహసీల్దార్లు, వీఆర్వోలను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి తహసీల్దార్లు, వీఆర్వోలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ప్రతి రోజు ఒక వీఆర్వో దాదాపు 40 కుల ధ్రువీకరణను చేయాలని ఆదేశించారు. 15 రోజుల్లోపు అన్ని పూర్తి కావాలన్నారు. జిల్లాలో 2,29,685 దరఖాస్తులు రాగా అందులో ఇప్పటి వరకు 70,604 మాత్రమే పూర్తి అయ్యాయన్నారు. ఇంకా 1,59,081 పెండింగ్‌లో ఉన్నాయన్నారు. ఎండీయూ వాహనాల ద్వారా రేషన్ పంపిణీ చేయాలన్నారు. ఈ కాన్ఫరెన్స్‌లో కర్నూలు మున్సిపల్ కమిషనర్ భార్గవ్‌తేజ, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ చిరంజీవి, పత్తికొండ ఆర్డీవో రామలక్ష్మి, డీఎస్ఓ కేవీఎస్ఎం ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

దేవమ్మ మడుగుకు గడ్డుకాలం..!


పొలాల మీదుగా వెళ్తున్న తెలంగాణ ట్రాక్టర్లు

- తుంగభద్రలోకి తెలంగాణరాష్ట్ర ఇసుక ట్రాక్టర్లు
- రెండు నెలలుగా కొనసాగుతున్న అక్రమ రవాణా
- 11 ఇసుక ట్రాక్టర్లను పట్టుకుని పోలీసులకు అప్పగించిన ఎదురూరు రైతులు
- ఇసుక తవ్వకాలు అరికట్టకపోతే కర్నూలుకు తాగునీరు కష్టమే

కర్నూలు(రూరల్), జూలై 3: కష్టకాలంలో కర్నూలును ఆదుకొనే దేవమ్మ మడుగు గడ్డు పరిస్థితిని ఎదుర్కొంటోంది. అక్రమార్కులు తుంగభద్ర నదిలోని దేవమ్మ మడుగులో ఇసుక తవ్వకాలు యథేచ్ఛగా కొనసాగిస్తున్నారు. బుధవారం కర్నూలు రూరల్ మండలం ఎదురూరు గ్రామ పొలిమేరలో ఉన్న తుంగభద్రనదిలోకి వెళ్లి ఏపీ హద్దులు దాటి అక్రమంగా ఇసుకను తీసుకెళ్తున్న గద్వాల జిల్లా మద్దూరు గ్రామానికి చెందిన 16 ట్రాక్టర్లను ఎదురూరు రైతులు పట్టుకున్నారు. అందులో ఆరు ట్రాక్టర్లను డ్రైవర్లు అవతలివైపుకు తీసుకెళ్లారు. మిగిలిన 11 ట్రాక్టర్లును తాలుకా పోలీసులకు, మైనింగ్‌శాఖ అధికారులకు పట్టుకున్నారు. 11ట్రాక్టర్లను సీజ్‌చేసి పోలీసులు కర్నూలుకు తీసుకొచ్చారు. వారం క్రితం కూడా తెలంగాణ రాష్ట్రం, రాజోలి, తూర్పు గార్లపాడుకు చెందిన ట్రాక్టర్లు కర్నూలు జిల్లా సరిహద్దులోకి వచ్చి ఇసుక తీసుకెళ్లుతూ పట్టుబడ్డాయి. రెండు నెలలుగా తెలంగాణలోని మనోపాడు మండలం మద్దూరు గ్రామానికి చెందిన ఇసుక అక్రమార్కులు ఇసుక దందా కొనసాగిస్తున్నారు. ప్రతి రోజూ ఒక్కొక్క ట్రాక్టర్ 5నుంచి 8 ట్రిప్పుల దాకా ఏపీ సరిహద్దుల్లోకి వచ్చి ఇసుకను తీసుకెళ్లి అవతలి వడ్డుపై డంప్ చేసి అక్కడినుంచి హైదరాబాద్‌కు తరలిస్తున్నట్లు తెలుస్తోంది. ఒక ట్రాక్టర్ ట్రిప్పు ఇసుకను రూ.5వేలకు విక్రయిస్తున్నట్లు తెలిపారు.

● అక్రమ ఇసుక నియంత్రణకు ఏళ్ల తరబడి విష్ణు పోరాటం



కర్నూలు జిల్లాతో పాటు, తెలంగాణ రాష్ట్రాల ప్రజలు రైతుల సాగు నీరు, తాగునీటి అవసరాల కోసం తుంగభద్ర నదిలో అక్రమ ఇసుక రవాణాను అరికట్టేందుకు టీడీపీ సీనియర్ నేత ఎదురూరు విష్ణువర్దన్‌రెడ్డి ఏళ్ల తరబడి పోరాటం చేస్తున్నారు. అనేకసార్లు ప్రభుత్వాలకు, కలెక్టర్లకు అక్రమ ఇసుక రవాణాను అరికట్టి నీటివనరులను కాపాడాలని విజ్ఞాపన పత్రాలు ఇచ్చారు. అంతేకాకుండా హైకోర్టులో నుంచి స్టే ఆర్డర్ తీసుకొచ్చారు. అయినా ఇసుక అక్రమ రవాణా ఆగలేదని స్థానికులు చెబుతున్నారు.

అక్రమంగా ఇసుక తీసుకెళ్తితే చర్యలు



తంగభద్ర నదిలోంచి అక్రమంగా ఇసుకను తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. గతంలో లాగా జరిమానా విధించి వదిలేయడం ఇక ఉండదు.

- మురహరి, రాయలీ, ఇన్‌స్పెక్టర్, మైనింగ్‌శాఖ, కర్నూలు

చట్టపరమైన చర్యలు తీసుకుంటాం




ఇప్పటి వరకు 11 ట్రాక్టర్లను సీజ్ చేశాం. మరో ఆరు ట్రాక్టర్లు తప్పించుకున్నాయి. వాటి నెంబర్ల సహాయంతో కర్నూలు తాలుక పోలీస్‌స్టేషన్‌కు రప్పించి చర్యలు తీసుకుంటాం.

- పీరయ్య, ఎస్‌ఐ, కర్నూలు తాలుకా


తుంగభద్రలో పట్టుబడిన తెలంగాణ ఇసుక ట్రాక్టర్స్‌తో పోలీసులు




అధికారులతో మాట్లాడుతున్న ఎస్‌ఐ పీరయ్య

జిల్లా పరిషత్‌లో పదోన్నతులు


పదోన్నతి పొంది ఉద్యోగులతో జిల్లా పరిషత్ చైర్మన్ పాపిరెడ్డి,సీఈఓ నాసరరెడ్డి

కర్నూలు(న్యూసిటీ), జూలై 3: జిల్లా పరిషత్ పరిధిలో పని చేస్తున్న జూనియర్ అసిస్టెంట్లు, టైపిస్టులకు సీనియర్ అసిస్టెంట్లుగా పదోన్నతులు కల్పిస్తూ జిల్లా పరిషత్ సీఈఓ జి. నాసరరెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. బుధవారం జిల్లా పరిషత్ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి చేతుల మీదుగా పదోన్నతి పొందిన ఉద్యోగులు నియామక ఉత్తర్వులు అందుకున్నారు. సంజామల మండలం నొస్సం జడ్పీ ఉన్నత పాఠశాలలో పని చేస్తున్న జూనియర్ అసిస్టెంట్‌కు జిల్లా పరిషత్ పరిపాలన భవనం సీనియర్ అసిస్టెంట్‌గా, ఆళ్లగడ్డ పీఆర్‌ఐ సబ్ డివిజన్‌లో పని చేస్తున్న టైపిస్టు ఎస్. సుమతకు జిల్లా పరిషత్ పరిపాలన భవనం సీనియర్ అసిస్టెంట్‌గా, కర్నూలు పీఆర్‌ఐ డివిజన్ కార్యాలయంలో టైపిస్టుగా పని చేస్తున్న నాగేశ్వరరెడ్డికి బేతంచెర్ల ఎంపీడీఓ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా, అవుకు ఎంపీడీఓ కార్యాలయంలో పని చేస్తున్న టైపిస్టు డి. బాబుప్రసాద్‌కు ఆళ్లగడ్డ పీఆర్‌ఐ సబ్ డివిజన్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా పదోన్నతి కల్పిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

పిన్నెల్లిని జగన్ కలవడమా..?: సోమిశెట్టి


సమావేశంలో మాట్లాడుతున్న సోమిశెట్టి వెంకటేశ్వర్లు

కర్నూలు(అర్బన్), జూలై 3: సార్వత్రిక ఎన్నికల్లో ఈవీఎంలను ధ్వంసం చేసిన పిన్నెల్లి రామక్రిష్ణారెడ్డిని నెల్లూరు జైలులో జగన్మోహన్‌రెడ్డి కలిసేందుకు వెళ్తానడం సిగ్గుచేటని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సోమిశెట్టి వెంకటేశ్వర్లు అన్నారు. బుధవారం జిల్లా టీడీపీ కార్యాలయంలోని తన చాంబర్లో మాట్లాడుతూ మే 13న జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో మాచర్ల నియోజకవర్గం ఎమ్మెల్యే, వైసీపీ అభ్యర్థి పిన్నెల్లి రామక్రిష్ణారెడ్డి తనకు వ్యతిరేకంగా ప్రజలు ఓట్లు వేస్తున్నారని గ్రహించి పోలింగ్ కేంద్రంలోకి వెళ్లి ఈవీఎంలను ధ్వంసం చేయడంతో ఎన్నికల కమిషన్ కేసులు నమోదు చేసిందన్నారు. ఆయన అరెస్టయి జైల్లో ఉండగా.. 5 సంవత్సరాలు ముఖ్యమంత్రిగా పని చేసిన వైస్ జగన్మోహన్‌రెడ్డి నెల్లూరు జైలులో ఉన్న పిన్నెల్లిని పరామర్శించేందుకు వెళ్తానని ఆయన నైజాన్ని తెలియజేస్తోందని అన్నారు. ఈ సమావేశంలో నగర అధ్యక్షుడు నాగరాజు యాదవ్, రాష్ట్ర క్రిష్టియన్ సెల్ ఉపాధ్యక్షుడు ఏవైఎస్ బాబు రాజు, ఎస్సీ సెల్ కార్యదర్శి పేరపోగు చిన్న మారెన్న పాల్గొన్నారు.

ఉపాధి శిక్షణ సంస్థ డైరెక్టర్‌గా పుష్పకుమార్


డైరెక్టర్ పుష్పకుమార్‌ను అభినందిస్తున్న సిబ్బంది

కర్నూలు(న్యూసిటీ), జూలై 3: కెనరా బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణా సంస్థ డైరెక్టర్‌గా కే. పుష్పకుమార్ నియమితులయ్యారు. బుధవారం శిక్షణ కార్యాలయంలో ఆయనను పలువురు కలిసి అభినందనలు తెలిపారు. గతంలో ఎస్‌ఆర్ పేట బ్రాంచు మేనేజర్‌గా పని చేస్తున్న అతనికి బదిలీ చేసి సంస్థ డైరెక్టర్‌గా నియమించారు. ఈ సందర్భంగా పుష్పకుమార్ మాట్లాడుతూ యువతీ, యువతులకు ఉద్యోగ, ఉపాధి కల్పన కోసం కృషి చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

రైలు కింద పడి ఇద్దరు వ్యక్తులు మృతి

నంద్యాల (నూనెపల్లె), జూలై 3: నంద్యాల మూడో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలోని మూల సాగరం రైల్వే గేట్ సమీపంలో ప్రయాణిస్తున్న రైలులో నుంచి ప్రమాదవశాత్తు కింద పడి ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు మృతి చెందినట్లు రైల్వే పోలీసులు బుధవారం తెలిపారు. ఘటనా స్థలానికి రైల్వే ఎస్‌ఐ జలీల్, త్రీటౌన్ సీఐ నరసింహులు, సిబ్బంది చేరుకుని మృతదేహాలను పరిశీలించారు. మృతులలో ఒకరికి 55 సంవత్సరాలు, మరొకరికి 35 సంవత్సరాలు ఉంటాయన్నారు. వారి వద్ద ఎలాంటి ఆధారాలు లభించలేదన్నారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రి మార్చురి గదికి తరలించారు. కేసు దర్యాప్తు నిర్వహిస్తున్నట్లు రైల్వే ఎస్‌ఐ జలీల్ తెలిపారు.

రైలు నుంచి జారిపడి బీటెక్ విద్యార్థి మృతి

పాణ్యం, జూలై 3: స్థానిక రైల్వే స్టేషన్ సమీపంలోని గాలేరు, నగరి వద్ద రైలు నుంచి జారిపడి బీటెక్ విద్యార్థి సునీల్‌కుమార్‌రెడ్డి మృతి చెందాడు. ప్రకాశం జిల్లా కంభం పట్టణం కాప వీధికి చెందిన వెంకటేశ్వరరెడ్డి, కృష్ణవేణి దంపతులకు ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు. వారు హైదరాబాదులోని ఉప్పల్ సమీపంలోని చిలకలనగర్‌లో నివాసముంటున్నారు. వెంకటేశ్వరరెడ్డి వాచ్‌మెన్‌గా ప్రైవేటు కంపెనీలో పని చేస్తున్నాడు. సునీల్‌కుమార్‌రెడ్డి హైదరాబాదులోని ప్రైవేటు ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ చదువుతున్నాడు. రేషన్ బియ్యం తెచ్చుకోవడానికి బుధవారం స్వగ్రామానికి కాచిగూడ, గుంటూరు రైలులో వస్తూ పాణ్యం సమీపం లో తెల్లవారుజామున రైలు నుంచి జారిపడి మృతి చెందాడు. బంధువులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే ఎస్‌ఐ ఖలీల్ తెలిపారు.

వైసీపీ ఆదోని పట్టణాధ్యక్షుడిపై కేసు నమోదు

ఆదోని, జూలై 3: ఆదోని పట్టణ అధ్యక్షుడు దేవాతో పాటు మరో ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు త్రీటౌన్ సీఐ నరసింహరాజు తెలిపారు. సీఐ తెలిపిన మేరకు వివరాలు... ఆదోని పట్టణానికి చెందిన ఓ వివాహితను చిరంజీవి అనే వ్యక్తి వివాహేతర సంబంధం పెట్టుకుని ఆమెను తీసుకెళ్లిపోయాడు. 2024 మే 30వ తేదీన ఆమె భర్త ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేశారు. సదరు వివాహితను తీసుకెళ్లిన సమయంలో చిరంజీవికి వైసీపీ పట్టణ అధ్యక్షుడు దేవాతో పాటు రామాంజి సహకరించినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. వారి సహకారంతోనే తన భార్యను తీసుకెళ్లారని బాధితుడు సబ్ కలెక్టర్ శివనారాయణ శర్మకు ఫిర్యాదు చేశారు. దీంతో కేసు నమోదు చేయాలని త్రీటౌన్ పోలీసులను సబ్‌కలెక్టర్ ఆదేశించారు.

కేఎంసీ డీఈ నిర్వాకం

- సొంతింటికి 24 గంటల సరఫరా తాగునీటి పైప్‌లైన్
- కార్పొరేషన్ సొమ్ము రూ. లక్ష ఖర్చు
- చోద్యం చూస్తున్న అధికారులు

కర్నూలు(న్యూసిటీ), జులై 3: ఈ అధికారికి నగర ప్రజల అవసరాల కంటే సొంత అవసరాలే ముఖ్యమయ్యాయి. నగర పాలక సంస్థలోని అనేక కాలనీల్లో తాగునీటి వసతి సరిగా లేనప్పటికీ సదరు డిప్యూటి ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ తన ఇంటికి 24 గంటలు నీరు సరఫరా చేసుకోడానికి ఏర్పాటు చేసుకున్నాడు. ఇదేదో రహస్యంగా కాదు. ఉన్నతాధికారులకు కూడా తెలుసు. అయినా ఎవ్వరూ పట్టించుకోలేదు. చివరాఖరికి ఎమ్మెల్యే దగ్గరికి ఈ వ్యవహారం వెళ్లినట్లు తెలుస్తోంది. ఏమవుతుందో చూడాలి.

నగర సంస్థ కార్యాలయంలోని ఓ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ నిర్వాకం చూస్తే ప్రతి ఒక్కరూ ముక్కున వేలేసుకుంటున్నారు. అన్యాయాన్ని అరికట్టాల్సిన అధికారి తన ఇంటికి 24 గంటలు తాగు నీరు సరఫరా కావడానికి కార్పొరేషన్ నిధులతో పైప్‌లైన్ అమర్చుకున్నారు. ఇదంతా తెలిసిన కూడ అధికారులు మిన్నకుండి పోవడం ఏమిటని కొందరు ప్రశ్నిస్తున్నారు. శివారు కాలనీలలోని తాగునీటి సమస్యను పరిష్కరించడానికి కృషి చేయాల్సిన కార్పొరేషన్ అధికారులే ఇంత బరితెగింపునకు దిగారు. ఈ విషయంపై ఓ ఎమ్మెల్యే వద్ద పంచాయితీ కూడా జరిగింది. ఆ ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది. చివరికి ఆ పైప్‌లైన్‌ను తొలగించేందుకు అధికారులు ప్రయత్నిస్తున్నారు. ముందుగానే అడ్డుకోవాల్సిన అధికారులు ఎమ్మెల్యే సహా అందరి దృష్టికి వెళ్లాకే పైప్‌లైన్ ఎందుకు తొలగిస్తున్నారనేది చర్చనీయాంశమైంది.


పనులు చేస్తున్న కార్పొరేషన్ కార్మికులు

● రూ.లక్ష కార్పొరేషన్ నిధులతో..

అధికారి నగర పాలక సంస్థ నిధులు రూ.లక్ష ఖర్చుచేసి ఈ అధికారి తన ఇంటికి సుమారు వందమీటర్ల పొడవున లైన్‌ను ఏర్పాటు చేసుకున్నాడు. దీనికి కార్పొరేషన్ కార్మికులతో పని చేయించుకున్నాడు. శివారు కాలనీలలో రోడ్లు..డ్రైనేజీ వ్యవస్థను బాగుచేయాలంటే స్టాండింగ్ కమిటీ, కౌన్సిల్ సమావేశంలో తీర్మానం అవసరం అవుతాయి. మరి ఏ తీర్మానాలు లేకుండా ఇంత అధికార దుర్వినియోగం ఎలా జరిగిందనే చర్చ తీవ్రస్థాయిలో జరుగుతోంది.

● మంత్రి పేరుతో బెదిరింపులు..

జిల్లాలోని ఓ మంత్రి పేరు చెప్పుకుని సదరు అధికారి అందరినీ బెదిరిస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం. నూతన ప్రభుత్వం ఏర్పాటయ్యాక బదిలీ తప్పదని భావించిన అధికారి మంత్రిని మర్యాదపూర్వకంగా కలిసాడు. తనకు బదిలీ జరగదని, మంత్రి అండదండలు ఉన్నాయని గొప్పలు చెపుకుంటున్నట్లు వినికిడి. అంతే కాకుండా కొందరు కాంట్రాక్టర్లు, అధికారులను బెదిరిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ విషయంపై ఉన్నతాధికారులు ఎలాంటి చర్యలు తీసుకుంటారో వేచి చూడాలి.


పైప్‌లైన్ కోసం తవ్విన గుంత

● అనవసరంగా బురదచల్లుతున్నారు..

నాపై అనవసరంగా బురదచల్లుతున్నారు. నా ఇంటి మీద నుంచి సుమారు 25 ఇళ్లకు పైప్‌లైన్ వెళ్తుంది. కొందరు కావాలనే నన్ను ఇరికించేందుకు నిరాధార ఆరోపణలు చేస్తున్నారు.

.గోపాలక్రిష్ణ, డీఈఈ, నగర పాలక సంస్థ, కర్నూలు

హత్య కేసులో నిందితుల అరెస్టు


శ్రీదేవి హత్య కేసులో నిందితులను చూపిస్తున్న డీఎస్పీ షర్ఫుద్దీన్

నంద్యాల, జూలై 3(ఆంధ్రజ్యోతి): ఆళ్లగడ్డ పట్టణంలోని పాతూరు వీధిలో నివాసం ఉంటున్న అట్ల భాస్కరరెడ్డి భార్య, టీడీపీ కార్యకర్త శ్రీదేవి హత్య కేసులో నిందితులను అరెస్టు చేసినట్లు డీఎస్పీ షర్ఫుద్దీన్ తెలిపారు. ఆళ్లగడ్డ పట్టణ పోలీస్ స్టేషన్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత నెల 25వ తేదీన నంద్యాలలో భాస్కరరెడ్డికి డయాలసిస్ చేయించుకొని ఇంటికి రాగానే కాంపౌండు వద్ద శ్రీదేవి మరిది వేణుగోపాలరెడ్డి, అతని భార్య శిరీష, రాకేష్, దేవేంద్ర కుమార్, శేఖర్ సింగ్, నరేష్ కళ్లలో కారంపొడి చల్లి ఇనుపరాడ్లు, కట్టెలతో దాడి చేశారని తెలిపారు. ఇందులో భాస్కరరెడ్డి రెండు కాళ్లపై రక్త గాయాలయ్యాయని, శ్రీదేవికి బలమైన గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందిందని డీఎస్పీ చెప్పారు. నిందితులపై 302,307,324,120(బి) ఆర్/డబ్ల్యు 34 సెక్షన్ల కింద పట్టణ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశామన్నారు. గత 20 సంవత్సరాల నుంచి వీరి మధ్య ఆస్తి తగాదాలు ఉండటమే హత్యకు కారణమని అన్నారు. నిందితులను పట్టణంలోని రామలక్ష్మి కొట్టాల సమీపంలో అరెస్టు చేశామన్నారు. ఈ కేసులో ఏవీ సుబ్బారెడ్డి కుటుంబ సభ్యులు, అతని అనుచరులు ఉన్నారని, వారి కోసం గాలింపు చర్యలు చేపట్టామన్నారు. నిందితుల నుంచి రెండు బైకులు, కర్ర, 5 ఇనుప రాడ్లు, 6 సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నామని, నిందితులను కోర్టులో హాజరు పరచగా మేజిస్ట్రేట్ రిమాండుకు ఆదేశించారని డీఎస్పీ షర్ఫుద్దీన్ వివరించారు. ఈ సమావేశంలో పట్టణ సీఐ రమేష్‌బాబు, ఎస్‌ఐ వెంకటరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

నందికొట్కూరు రూరల్ జూలై 3 : నందికొట్కూరు మండలం బ్రాహ్మణకొట్కూరు పోలీస్ స్టేషన్ పరిధిలోని కేజీ రహదారిపై ఆర్టీసీ బస్సు బైక్‌ను ఢీకొట్టిన ప్రమాదంలో బ్రాహ్మణకొట్కూరుకు చెందిన రవి (35) అక్కడికక్కడే మృతి చెందాడు. బుధవారం రాత్రి బ్రాహ్మణకొట్కూరుకు చెందిన ఆర్మపోగు రవి భారత్ పెట్రోల్ బంక్ వద్దకు బైక్‌పై వెళుతుండగా కర్నూలు నుంచి ఒంగోలు వెళుతున్న కర్నూలు 1 డిపో ఏపీ 21 జెడ్ 0696 నెంబర్ గల బస్సు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో రవి అక్కడికక్కడే చనిపోయాడు. ఎస్సై నాగార్జున సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని నందికొట్కూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించా రు. మృతుడి అన్న రాజు ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి భార్య, కొడుకు, కూతురు ఉన్నారు.

యువ రైతు మృతి

వెల్దుర్తి, జూలై, 3: మండలంలో గుంటుపల్లె గ్రామంలో యువరైతు మృతి చెందాడు. గ్రామానికి చెందిన రామ్మోహన్ తనకున్న 4 ఎకరాల పొలంతోపాటు సూదేపల్లె గ్రామంలో 16 ఎకరాలు కౌలుకు తీసుకొని సాగుచేస్తున్నాడు. గత మూడు సంవత్సరాల నుండి వర్షాలుసరిగ్గా పడక, పంట దిగుబడులు చేతికి రాక సుమారుగా రూ.24 లక్షలు అప్పులు చేశాడు. మంగళవారం అర్ధరాత్రి దాహం కావడంతో లేచి నిద్రమత్తులో నీరు తాగి హఠాత్తుగా విగతజీవిగా పడిపోయాడు. భార్య కాలనీవాసుల సాయంతో ఆటోలో వెల్దుర్తి ఆసుపత్రికి తరలించింది. అప్పటికే అతను మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. భార్య లక్ష్మీదేవి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. మృతుడికి ఇద్దరు కుమారులు, ఇద్దరు కూతుళ్ల ఉన్నారు. చనిపోయిన రైతు కుటుంబాన్ని ఆదుకోవాలని గ్రామస్తులు ప్రభుత్వాన్ని కోరారు.

సీఎంను కలిసిన గౌరు దంపతులు

- అలగనూరు, గోరుకల్లు రిజర్వాయర్ల మరమ్మతులపై చర్చ
- కల్లూరు అర్బన్ తాగునీటి సమస్యను పరిష్కరించాలని విజ్ఞప్తి


సీఎం చంద్రబాబుకు పుష్పగుచ్చం అందజేస్తున్న ఎమ్మెల్యే జయసూర్య, గౌరు చరిత, గౌరు వెంకటరెడ్డి

కల్లూరు/నందికొట్కూరు, జులై 3: రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడును పాణ్యం ఎమ్మెల్యే గౌరుచరిత, నందికొట్కూరు టీడీపీ ఇన్‌చార్జ్ గౌరు వెంకటరెడ్డి, నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్తా జయసూర్య మర్యాదపూర్వకంగా కలిశారు. విజయవాడలోని క్యాంప్ కార్యాలయంలో బుధవారం సీఎం చంద్రబాబును వారు కలిసి పలు అంశాలపై మాట్లాడారు. ముఖ్యంగా పాణ్యం నియోజకవర్గంలోని అలగనూరు, గోరుకల్లు రిజర్వాయర్ మరమ్మతుకు చర్యలు తీసుకుని ప్రజల తాగు, సాగునీటి అవసరాలు తీర్చాలని ముఖ్యమంత్రికి వివరించారు. వెలగమాను డ్యాం నిర్మాణం, గడివేములకు బైపాస్ రోడ్డును ఏర్పాటు చేసి ప్రజలు వాహనదారుల సమస్యలను పరిష్కరించాలని కోరారు. కర్నూలు నగరపాలక సంస్థ పరిధిలోని కల్లూరు అర్బన్ 16 వార్డులకు ప్రతిరోజూ తాగునీటి సరఫరా అందించేలా చర్యలు తీసుకుని వార్డుల అభివృద్ధికి నిధులు కేటాయించాలని సీఎం చంద్రబాబును కోరారు. ముఖ్యంగా గత వైసీపీ ప్రభుత్వంలో గడివేముల, పాణ్యం, ఓర్వకల్లు, కల్లూరు మండలాల్లో వైసీపీ నాయకులు చేసిన భూకబ్జాలు, అక్రమాలపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని పాణ్యం ఎమ్మెల్యే గౌరుచరిత, గౌరు వెంకటరెడ్డి సీఎం చంద్రబాబునాయుడు దృష్టికి తీసుకెళ్లారు. ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

జిల్లా సహకార కేంద్ర బ్యాంకు లాభం రూ.1.68 కోట్లు

కర్నూలు(అగ్రికల్చర్), జూలై 3: ఉమ్మడి కర్నూలు జిల్లాలో రైతుల అభివృద్ధి, జీవనోపాధి మెరుగుపరిచేందుకు వివిధ రూపాల్లో రుణసదుపాయాన్ని అందిస్తున్న కర్నూలు జిల్లా సహకార కేంద్ర బ్యాంకు అధికారులు, సిబ్బంది చేస్తున్న కృషి సత్ఫలితాలను ఇస్తున్నాయి. గత సంవత్సరం బ్యాంకుకు రూ.1.68 కోట్ల నికరలాభం వచ్చిందని సీఈఓ విజయకుమార్ తెలిపారు. ఇటీవల బ్యాంకు లావాదేవీలపై నిర్వహించిన ఆడిట్‌లో ఈ వివరాలను వెల్లడించారు. జిల్లా సహకార కేంద్ర బ్యాంకు టర్నోవర్ రూ.4 కోట్లకు పెంచాలని లక్ష్యంగా చేసుకున్నామనీ, ఇందులో భాగంగా రూ.3.920 కోట్ల వ్యాపారాన్ని సాధించామన్నారు. ఇందులో డిపాజిట్లు రూ.750 కోట్లు కాగా, అడ్వాన్సులు రూ.3.170 కోట్లు ఉందన్నారు. గత సంవత్సరం రైతులకు చేరువలోనే సహకార బ్యాంకు సేవలు అందించాలనే ఉద్దేశంతో ప్యాపిలి మండలం నేరేడుచెర్ల, డోన్ మండలం ఎద్దుపెంటలో కొత్త బ్రాంచ్‌లను ఏర్పాటు చేశామ తెలిపారు. ఈ సంవత్సరం నంద్యాల జిల్లాలోని గోస్పాడు మండలం యాల్లూరు, బనగానపల్లె మండలం నందవరం, మండల కేంద్రమైన కొలిమిగుండ్లలో నూతన బ్రాంచ్‌లు ఏర్పాటు చేస్తున్నామనీ తెలిపారు. బ్యాంకుకు లాభాలు రావడంపై గత సీఈఓ రామాంజనేయులు, జీఎం శివలీల, డీజీఎంలు ఉమామహేశ్వరరెడ్డి, సునీల్ కుమార్, నాగిరెడ్డి తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

కాటు వేస్తున్న ఖాళీ స్థలాలు

» చెత్తా చెదారంతో అధికమవుతున్న దోమల వ్యాప్తి
» రోగాలతో ఆసుపత్రి పాలవుతున్న జనాలు

కర్నూలు(అగ్రికల్చర్), జూలై 3: కర్నూలు నగరంలో నివాసాల మధ్య ఉన్న వందలాది ఎకరాలు ఏళ్ల తరబడి వినియోగంలోకి రాక ముళ్లకంపలు, చెత్తకుప్పలకు స్థావరాలుగా మారాయి. దీని వల్ల సమీపంలోనే నివాసం ఉంటున్న కాలనీల వాసులు భయంతో వణికిపోతున్నారు. మురుగు నీరు, ముళ్లకంపలతో దోమలు, విష పురుగులు చేరిపోతున్నాయి. దీంతో రోగాలు విజృంభిస్తున్నాయి. ఖాళీ స్థలాలపై విస్తీర్ణాన్ని బట్టి ట్యాక్స్ వసూలు చేయాల్సిన మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు రాజకీయ నాయకులు, బడా రియల్ ఎస్టేట్ వ్యాపారుల ఒత్తిళ్ల కారణంగా అటువైపు కన్నెత్తి కూడా చూడలేక పోతున్నారు.

● **కంటిమీద కునుకు లేని జనాలు:** కర్నూలు నగరంలో సంపత్‌నగర్, ఉల్చాల రోడ్డు నుంచి పెద్దపాడు వరకు, అలాగే బళ్లారి రోడ్డు వైపు దాల్‌మిల్ వరకు మురళీ నగర్, ముజఫర్‌నగర్, గుత్తి పెట్రోలు బంకు నుంచి కార్బైడ్ ఫ్యాక్టరీ, నంద్యాల రోడు లో రేడియో స్టేషన్ ఇలా చెప్పుకుంటూ పోతే నగర పరిధిలో ప్రజలు నివాసం ఉంటే సమీపాల్లో రాజకీయ నాయకులు, రియల్ ఎస్టేట్ దారులు వందల ఎకరాలను కొనుగోలు చేశారు. ఈ స్థలాలతో ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు, ఆరోగ్యం దెబ్బతినకుండా జాగ్రత్త పడాల్సిన బాధ్యత వారిదే. వారు నిర్లక్ష్యం చూపినా మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు స్థలాలను ముళ్లచెట్లు, మురికి నీరు, చెత్తాచెదారం నిలువకుండా యాజమానులకు ఎప్పటికప్పుడు నోటీసులు అందించి హెచ్చరించాల్సిన బాధ్యత వారిదే. నగరంలోని ఖాళీ స్థలాలు లక్షలాది జనానికి కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయి. ప్రమాదకర వ్యాధులు డెంగీ, చికెన్‌గున్యా, మలేరియా వంటి ప్రమాదకరమైనవి ఈ ఖాళీ స్థలాల్లో చేరిన మురికి నీరు, ముళ్లకంపల వల్లనే వ్యాపిస్తున్నాయి. ఈ ఖాళీ స్థలాల వల్ల వర్షాకాలంలో సమీపాల్లో నివాసముంటున్న వారు ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని జీవిస్తున్నారు. పెద్దపెద్ద పాములు, పందికొక్కులు, పందులకు ఈ ఖాళీ స్థలాలే ఆవాసాలుగా మారుతున్నాయి. వీటి బెడదతో నిద్రలేని రోజులు గడపాల్సిన పరిస్థితి నెలకొందని కాలనీవాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.


మురారీనగర్‌లో ఖాళీ స్థలంలో మురుగు

● **ఆదాయానికి గండి పడుతున్నా పట్టని అధికారులు:** ఖాళీ స్థలాలను సంవత్సరాల తరబడి అలాగే ఉంచితే మున్సిపల్ అధికారులు యజమానులపై చర్యలు తీసుకోవచ్చు. ప్రతి సంవత్సరం ఆ స్థలాల విస్తీర్ణాన్ని లెక్కించి ఆస్తి పన్ను వసూలు చేయాలి. నగరంలోని వందల ఎకరాల్లో ఉన్న ఈ ఖాళీల నుంచి పన్ను వసూలు మొదలుపెడితే ఏటా రూ. 10 నుంచి రూ. 20 కోట్ల ఆదాయం ఖజానాకు చేరుతుందని మున్సిపల్ అధికారులు అంచనా వేస్తున్నారు. అయితే ఈ స్థలాన్ని బడా రాజకీయ నాయకులు, రియల్ ఎస్టేట్ వ్యాపారులవే కావడంతో వీరితో పెట్టుకుంటే ఒక్క రోజు ఇక్కడ పని చేయలేమని శంకరగిరి మాన్యాలు పట్టిస్తారని మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అయితే ఆస్తి పన్ను వసూలు దేవుడెరుగు ఈ స్థలాల్లో ముళ్ల చెట్లు, మురికి నీరు చేరకుండా యజమానులు జాగ్రత్త తీసుకునేలా మున్సిపల్ అధికారులు చర్యలు తీసుకోవాలని నగర ప్రజలు కోరుతున్నారు.

సంపత్‌నగర్ కాలనీలో.. సంపత్‌నగర్ కాలనీలో ఉన్న ముళ్ల చెట్ల పొదల నుంచి ప్రతి రోజూ రాత్రిపూట పాములు కాలనీలో ప్రవేశిస్తుండటంతో ప్రజలు భయాందోళనలు చెందుతున్నారు. కొంత మంది పాముకాటుకు గురై ఆసుపత్రి పాలవుతున్నారు. దీనికి తోడు గాలి, వాన మొదలైన వెంటనే కరెంటు సరఫరా నిలిపివేయడంతో అడుగు బయట పెట్టాలంటే కాలనీవాసులు ప్రాణాలు అరచేతిలో పెట్టుకోవాల్సి వస్తోంది. ఎన్నోసార్లు సచివాలయాల్లో, మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో తమ కాలనీ సమీపంలో ఉన్న ముళ్ల చెట్లను తొలగించి శుభ్రం చేయాలని విన్నవించుకున్నా ఫలితం లేకుండా పోయిందని, ఎవరూ తమ కాలనీ వైపు కన్నెత్తి చూడడం లేదని ఈ కాలనీవాసులు ఆందోళన చెందుతున్నారు.


సంపత్‌నగర్‌లో ఇళ్లపైకి ఎగబాకిన ముళ్లకంపలు

వర్షాకాలం వస్తే జాగరణే

సంపత్ నగర్‌లో ఖాళీ స్థలాల మధ్య నివాసం ఉంటున్నాం. ముళ్ల చెట్లు, మురికి నీరు ఆ స్థలాల్లో ఉండటం వల్ల పాములు పందికొక్కులకు స్థావరాలుగా మారాయి. వర్షాకాలంలో అవి మా ఇళ్ల పరిసరాల వద్ద కనిపిస్తున్నాయి. రాత్రిళ్లయితే నిద్రలేకుండా జాగరణ చేయాల్సి వస్తోంది. ఇళ్ల మధ్య ఖాళీ స్థలాలను సంవత్సరాలుగా అలాగే ఉంచుతున్నారు. అక్కడ దోమలు, పందులు చేరి నివాసం ఉండే వారికి జ్వరాలు, ప్రమాదకరమైన రోగాలు వ్యాపిస్తున్నాయి.

- వెంకటేశ్, సంపత్‌నగర్

పాములు, విషపురుగులు ఇళ్లలోకి వస్తున్నాయి

రాత్రిపూట పాములు, విషపురుగుల బెడద ఎక్కువైపోయింది. వర్షాకాలంతోపాటు రాత్రిపూట కరెంటు లేని సమయంలో పాములు ఇళ్లలోకి వస్తున్నాయి. భయంతో అల్లాడిపోతున్నాం. సచివాలయంలో ఫిర్యాదు చేసినా అక్కడ అధికారులు కనీసం ఒక్కసారైనా వచ్చి చూడలేదు. గతంలో ప్రజాప్రతినిధులకు కూడా మా సమస్యను పరిష్కరించాలని కోరాం. ముళ్లపొదలను తొలగిస్తానని హామీ ఇచ్చారు. నెలలు కావస్తున్నా మా సమస్య తీరలేదు.

- అంజనమ్మ, సంపత్‌నగర్

కర్నూలు-బళ్లారి హైవే నిర్మాణానికి సహకరించాలి

కేంద్ర మంత్రి గడ్కరిని కోరిన ఎంపీ నాగరాజు


కేంద్ర మంత్రి గడ్కరికి సమస్య వివరిస్తున్న ఎంపీ

కర్నూలు(అర్బన్), జూలై 3: జిల్లా అభివృద్ధే లక్ష్యంగా ఎంపీ బస్తిపాటి నాగరాజు వరుసగా కేంద్ర మంత్రులను కలుస్తున్నారు. బుధవారం ఢిల్లీలో కేంద్ర రోడ్డు, రవాణా, రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీని కలిసి కర్నూలు-బళ్లారి హైవే నిర్మాణానికి సహకరించాలని కోరారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ కర్నూలు టోల్ ప్లాజా నుంచి పంచలింగాల గ్రామం వరకు సర్వీసు రోడ్డును విస్తరణ చేపట్టాలని గడ్కరికి వినతి పత్రం సమర్పించారు. దీనిపై కేంద్ర మంత్రి సానుకూలంగా స్పందించారని, బళ్లారి హైవే రోడ్డుతోపాటు విస్తరణకు హామీ ఇచ్చారని ఎంపీ తెలిపారు.

ఆకట్టుకుంటున్న ఎలక్ట్రిక్ స్కూటర్


ఎలక్ట్రిక్ స్కూటర్‌ను విడుదల చేస్తున్న నిర్వాహకులు

కల్లూరు, జూలై 3: విపణిలో ఎలక్ట్రిక్ స్కూటర్ వినియోగదారులను ఆకట్టుకుంటోంది. నంద్యాల చెక్‌పోస్టు సమీపంలోని అమిగోస్ మెబిలిటీ ప్రైవేట్ లిమిటెడ్ ఏతెర్ షోరూమ్‌లో ఏతెర్ రిస్తా వాహనాన్ని బుధవారం లాంఛనంగా విడుదల చేశారు. షోరూమ్ సేల్స్ మేనేజర్ ఏ.జయకాంత్ మొదట వినియోగదారుడికి వాహనాన్ని అందజేశారు. కంపెనీ మేనేజింగ్ డైరెక్టర్ ఎం. నివేదితారెడ్డి, ఎంవీఎస్. ప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ రిస్తా ప్రారంభం ధర రూ.1,09,999 నుంచి ప్రారంభం అవుతుందన్నారు. పొడవాటి సీటు, దాని కింద స్టోరేజీ సామర్థ్యం, మూడేళ్ల బ్యాటరీ వారంటీ సదుపాయంతో ఆకర్షణీయమైన ఏడు రంగుల్లో ఈ వాహనం లభిస్తుందన్నారు. కార్యక్ర మంలో షోరూమ్ సిబ్బంది పాల్గొన్నారు.

వంద శాతం పురోగతి సాధించండి: కలెక్టర్

కర్నూలు(కలెక్టరేట్), జూలై 3: సెప్టెంబరు 30వ తేదీ నాటికి నీతి అయోగ్ సంస్థ అస్పిరేషనల్ బ్లాక్స్ (సంపూర్ణత అభియాన్) ప్రోగ్రాం కింద గుర్తించి 6 అంశాల్లో సాచురేషన్ పద్ధతిలో వంద శాతం పురోగతి సాధించే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ పి.రంజిత్‌బాషా సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో ఆస్పిరేషనల్ బ్లాక్స్ ప్రోగ్రాం కింద జిల్లాలో నిర్వహించనున్న సంపూర్ణత అభియాన్ కార్యక్రమం పై సంబంధిత అధికారులతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ భారత ప్రభుత్వం ఆస్పిరేషనల్ బ్లాక్స్ ప్రోగ్రాం కింద సంపూ ర్ణత అభియాన్ కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశాలు జారీ చేశారన్నారు. కేంద్ర ప్రభుత్వ నీతి అయోగ్ సంస్థ ఆదేశాల మేరకు ఆస్పిరేషనల్ బ్లాక్స్ ప్రోగ్రాం కింద జిల్లాలో సంపూర్ణత అభియాన్ కార్యక్రమాలు 4వ తేదీ నుంచి 6వ తేదీ వరకు నిర్వహించాల్సి ఉంటుందన్నారు. క్యాంపు కార్యాలయంలో సీపీవో హిమప్రబాకర్ రాజు, జడ్పీ సీఈవో నాసరరెడ్డి, బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ వెంకటలక్ష్మమ్మ, డీఆర్‌డీఏ పీడీ సలీంబాషా పాల్గొన్నారు.

బెస్ట్ అవైలబుల్ స్కూల్ స్కీమ్‌ను పునరుద్ధరించాలి

కర్నూలు(కలెక్టరేట్), జూలై 3: గిరిజన విద్యార్థులకు బెస్ట్ అవైలబుల్ స్కూల్ స్కీమ్‌ను పునరుద్ధరించాలని బుధవారం అమరావతి సచివాలయం లోని గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సంధ్యారాణిని కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా టీఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు రాగిరి చంద్రప్ప మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వం ఈ పథకాన్ని రద్దు చేయడంతో వేల మంది గిరిజన విద్యార్థులు చదువుకు దూరమయ్యారని, టీడీపీ కూటమి ప్రభుత్వం ఈ పథకాన్ని అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో అక్కుల ప్ప నాయక్, విష్ణు నాయక్ పాల్గొన్నారు.

ఆటపాటలతో విద్యనభ్యసించాలి

సి.బెళగల్, జూలై 3: ఆటపాటలతో విద్యనభ్యసించాలని ఎంఈవో ఆదాంబాషా అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని కస్తూర్బా పాఠశాలలోని పదో తరగతి విద్యార్థినులకు ఆయన పాఠాలు బోధించారు. ఎంఈవో వెంట హెచ్‌ఎం కిశోర్, సీఆర్‌పీలు ఉన్నారు.

దర్గా వద్ద బోరును ఏర్పాటు చేయండి


సూపరింటెండెంట్‌కు వినతి పత్రం ఇస్తున్న టీడీపీ నాయకులు

సి.బెళగల్, జూలై 3: చందమామయ్య దర్గా వద్ద బోరును ఏర్పాటు చేయాలని టీడీపీ మండల మాజీ కన్వీనర్ డాక్టర్ తిమ్మప్ప, ముస్లిం మైనార్టీ నాయకుడు దూద్‌వలి, బాలాజి వెంకటేష్, రాజు సూపరిం టెండెంట్ శ్రీనివాసులుకు వినతి పత్రం అందజేశారు. తిమ్మప్ప మాట్లాడుతూ మొహర్రం పండుగ సందర్భంగా దర్గా వద్ద అన్ని ఏర్పాటు చేశామని, తాగునీటి సమస్యను తీర్చేందుకు బోరును ఏర్పాటు చేయాలని కోరారు.

శివారు కాలనీల్లో సమస్యలు పరిష్కరించాలి

కర్నూలు(న్యూసిటీ), జూలై 3: నగర శివారు కాలనీల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని పట్టణ పౌర సంక్షేమ సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు ఇరిగినేని పుల్లారెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం శివారు కాలనీలు విష్ణుటౌన్‌షిప్, ఆంధ్రాబ్యాంకు కాలనీ, సంతోష్‌నగర్, టీజీవీ కాలనీల్లో కమిటీ బృందం పర్యటించారు. ఈ సందర్భంగా పుల్లారెడ్డి మాట్లాడుతూ నగర శివారు కాలనీల్లో డ్రైనేజీలు, రోడ్లు లేక ప్రజలు అవస్థలు పడుతున్నారన్నారు. మరికొన్ని కాలనీల్లో కాలువలు నిర్మించి మధ్య వదిలే యడంతో దుర్వాసనతో ప్రజలు అల్లాడుతున్నారన్నారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు ఎస్.రమేష్. కే.గోపినాథ్, టి.రంగయ్య, ఎ.వెంకటేశ్వర్లు, లక్ష్మన్న, పీవీ.వర్మ, యూనుస్ పాల్గొన్నారు.

ఈ-ఫార్మసీ ఆన్‌లైన్ ఎంట్రీ వంద శాతం చేయాలి

సూపరింటెండెంట్ డాక్టర్ సి.ప్రభాకర్ రెడ్డి

కర్నూలు(హాస్పిటల్), జూలై 3: ఈ-ఫార్మసీ ఆన్‌లైన్ నమోదును వంద శాతం పూర్తి చేయాలని ఆసుపత్రిని ప్రథమ స్థానంలో నిలపాలని కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల సూపరింటెండెంట్ డా.సి. ప్రభాకర్ రెడ్డి ఆదేశించారు. మంగళవారం ఆయన ఆసుపత్రిలోని ఫార్మసీ ఔషధ శాల, క్యాజువాల్టీ, ఓల్డ్ బ్లడ్ బ్యాంక్‌లో రౌండ్స్ నిర్వహించారు. ఆసుపత్రిలోని ఔషధశాల వద్ద పారిశుధ్య పనులను పరిశీలించారు. పలు విభాగాలు శానిటేషన్ పనులను సక్రమంగా నిర్వహించేలా చూడాలని సిబ్బందిని ఆదేశించారు. మూడు రోజులైన పనులు ఒక కొలిక్కి రాకపోవడంతో సిబ్బందిపై అసహనం వ్యక్తం చేశారు. కాలువలో మురికి సిల్ట్ తీయకుంటే డ్రైన్లు ఎలా శుభ్రమవుతాయన్నారు. ఆసుపత్రిలో శానిటేషన్ విభాగాన్ని పరిశీలించారు. డయోగ్నస్టిక్‌లో పారిశుధ్యం సరిగ్గా లేదని సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ తనిఖీలో ఆసుపత్రి ఏడీ రమేష్‌బాబు, ఏఆర్‌ఎంవో వెంకట రమణ, హాస్పిటల్ అడ్మినిస్ట్రేటర్స్ శివబాల, కిరణ్ కుమార్, సునీల్, ప్రశాంత్, ఫార్మసిస్టు శర్మ పాల్గొన్నారు.

పెద్దాసుపత్రికి ఈసీజీ మిషన్ విరాళం: కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలకు ప్రవాస భారతీయ వైద్యుడు కేఎంసీ 1971 బ్యాచ్ పూర్వ వైద్యుడు ఈసీజీ త్రీ చానల్ మిషన్‌ను విరాళంగా అందించారు. ప్రస్తుతం ఆయన గ్రెనడా వెస్టిండీస్‌లో వైద్యవృత్తిని కొనసాగిస్తున్నారు. గత నెల 21న ఆయన మిత్రుడు ప్రవాస భారతీయ వైద్యుడు డాక్టర్ రామమోహన్ కొప్పర్తి ఆసుపత్రికి ఈసీజీ యంత్రాని విరాళంగా ఇచ్చారు. ఈయన స్ఫూర్తితో డాక్టర్ రామమోహన్ ముందుకు వచ్చి బుధవారం ఆయన పంపించిన ఈసీజీ మిషన్‌ను ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ .సి.ప్రభాకర్ రెడ్డి కార్డియాలజి ఇన్‌చార్జి ప్రొఫెసర్ డా.లక్ష్మీబాయి, కార్డియాలజి అసిస్టెంట్ ప్రొఫెసర్ డా.కిరణ్ కుమార్, ఈసీజీ టెక్నీషియన్ తిరుమల్‌రావుకు అందజేశారు.


శానిటేషన్ విభాగంలో స్టాక్‌ను తనిఖీ చేస్తున్న సి.ప్రభాకర్ రెడ్డి

విద్యాశాఖ అధికారులపై చర్యలు తీసుకోవాలి

కర్నూలు(ఎడ్యుకేషన్), జూలై 3: రాష్ట్ర విద్యాశాఖలో జాయింట్ డైరెక్టర్ (సర్వీసెస్)గా పని చేస్తున్న మువ్వ రామలింగంపై, నంద్యాల విద్యాశాఖ అధికారి సుధాకర్ రెడ్డిపై చర్యలు తీసుకోవాలని విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌కు కర్నూలు జిల్లా ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు తేనే సాయిబాబా విజయవాడలో కలిసి ఫిర్యాదు చేశారు. మువ్వ రామలింగం అవినీతి కేసులో చిక్కుకున్నారని అన్నారు. లైంగిక వేధింపుల కేసులు కూడా ఉన్నాయన్నారు. అప్పటి రాష్ట్ర పాఠశాలల విద్యాశాఖ సంచాలకుడు వాడ్రేవు చిన్నవీరభద్రుడు రూ.లక్షల లంచం తీసుకుని రామలింగంకు జాయింట్ డైరెక్టర్ సర్వీసెస్ పదోన్నతులు కల్పించారన్నారు. లోకేశ్ స్పందిస్తూ ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని చెప్పారని సాయిబాబా తెలిపారు.

ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్‌పై శిక్షణ

కర్నూలు(ఎడ్యుకేషన్), జూలై 3: అఖిల భారత సాంకేతిక విద్యామండలి ఆధ్వర్యంలో కర్నూలు ఐఐఐటీడీఎం కర్నూలు కోర్ ఇంజనీరింగ్ కాలేజీ అధ్యాపకుల కోసం ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్‌పై క్వాలిటీ ఇంప్రూవ్‌మెంట్ ప్రోగ్రాం కార్యక్రమం ప్రారంభించారు. బుధవారం ఈ సందర్భంగా డైరెక్టర్ ప్రొఫెసర్ బీఎస్ మూర్తి ప్రోగ్రాంకు ఎంపికైన అభ్యర్థులను అభినందించారు. ఇది ఆరు నెలల సర్టిఫికెట్ ప్రోగ్రాం అని పరిశోధనా సౌకర్యాలు, తోటి అభ్యర్థులు, ఐఐఐటీడీఎం ప్రొఫెసర్లతో సహకారాన్ని ఉపయోగించుకోవాలని డైరెక్టర్ బీఎస్ మూర్తి సూచించారు. రిజిస్ట్రార్ గురుమూర్తి మాట్లాడుతూ ప్రస్తుత సాంకేతికతలను నేర్చుకోవడానికి రీస్కిల్లింగుకు ఇది ఒక అద్భుతమైన అవకాశం అన్నారు. డాక్టర్ రంగబాబు, సత్యబాబు, కృష్ణయ్య పాల్గొన్నారు.

జీతాలు చెల్లించాలని ఆందోళన

కోడుమూరు(రూరల్), జూలై 3: విద్యుత్ గాలిమరల దగ్గర పనిచేస్తున్న సెక్యూరిటీ సిబ్బంది జీతాలు చెల్లించాలని బుధవారం ఆందోళనకు దిగారు. ప్యాలకుర్తి వద్ద ఉన్న జీరో పాయింట్‌కు చేరుకున్న సెక్యూరిటీ సిబ్బంది తమకు మూడు నెలలుగా జీతాలు అందించలేదని ఆందోళన చేపట్టారు. సెక్యూరిటీ సిబ్బందికి సీపీఎం నాయకులు మద్దతు పలికారు. సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు నారాయణ మాట్లాడుతూ, విద్యుత్ గాలిమరల కంపెనీలో సుమారు 300 మంది సెక్యూరిటీ సిబ్బంది పనిచేస్తున్నారని, వారి పెండింగ్ జీతాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. విషయం తెలుసుకున్న కంపెనీ ప్రతినిధులు జీతాల చెల్లింపులకు సిద్ధపడడంతో ఆందోళన విరమించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు గఫూర్‌మియా, వీరన్న, రాజు, ఎర్రమద్దిలేటి, లక్ష్మన్న పాల్గొన్నారు.

చేతులు పరిశుభ్రంగా ఉంచుకోవాలి

కల్లూరు, జూలై 3: విద్యార్థులు చేతులు పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఎంఈఓ శ్రీనివాసులు, సార్డ్ ప్రాజెక్ట్ మేనేజర్ ఏఎస్. కుమారి స్పష్టం చేశారు. ఈమేరకు బుధవారం కల్లూరు మండలంలోని 51 పాఠశాలల నోడల్ అధికారులకు ఉపాధ్యాయులకు పరిశుభ్రతపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. డెటాల్ బనేగా స్వస్థ ఇండియా సారథ్యంలో శరీన్‌నగర్‌లోని ఎంఈఓ కార్యాలయంలో యం.శ్రీనివాసులు అధ్యక్షతన శిక్షణ ఇచ్చారు. జిల్లా సమన్వయకర్త పి.పుల్లన్న పాల్గొన్నారు.

హామీని నెరవేర్చాలి: డీవైఎఫ్ఐ

కర్నూలు(న్యూసిటీ), జూలై 3: టీడీపీ కూటమి ప్రభుత్వం వలంటీర్లకు ఇచ్చిన హామీని నెరవేర్చాలని డీవైఎఫ్ జిల్లా కార్య దర్శి నగేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం డీవైఎఫ్ఐ జిల్లా కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ అధికారంలోకి వచ్చిన వెంటనే వలంటీర్లకు రూ.10వేలు వేతనం ఇస్తామని ఇచ్చిన హామీని ప్రభుత్వం నిలబెట్టుకోవాలన్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలో లక్షలాది మంది వలంటీర్లను బలవంతంగా ఒత్తిడి చేసి అప్పటి పాలకులు రాజీనామాలు చేయించారన్నారు. వారిని విధుల్లోకి తీసుకోవాలని కోరారు.

మాత శిశుసంరక్షణ ప్రభుత్వం లక్ష్యం


గర్భిణులకు సలహాలిస్తున్న ఇందిరా

కోడుమూరు, జూలై 3: ప్రభుత్వం మాత శిశుసంరక్షణ కోసం ఎన్నో పథకాలను ప్రవేశపెట్టిందని జిల్లా పబ్లిక్ హెల్త్ నర్సింగ్ ఆఫీసర్ ఇందిరా అన్నారు. స్థానిక సచివాలయం 5ను బుధవారం ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రథకాలను గర్భిణులు, బాలింతలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. డాక్టర్ శ్రీమంత్ మాదన్న, హెల్త్ సిబ్బంది నరసప్ప, ఉమా బాయి. వనిత, లక్ష్మన్న పాల్గొన్నారు.

పాఠశాలల బస్సులు తనిఖీ


బస్సును తనిఖీ చేస్తున్న ట్రాఫిక్ సీఐ గౌతమి

కర్నూలు, జూలై 3: నగరంలో పలు చోట్ల ట్రాఫిక్ సీఐ గౌతమి ఆధ్వర్యంలో బుధవారం పోలీసులు పాఠశాల, కళాశాలల బస్సులను తనిఖీ చేశారు. డ్రైవింగ్ లైసెన్సులు, ఫిట్‌నెస్ సర్టిఫికెట్లను పరిశీలించారు. విద్యాసంస్థల బస్సు డ్రైవర్లకు కౌన్సెలింగ్ ఇచ్చారు. అలాగే రాజ్‌విహార్ కూడళ్లలో లైసెన్సు లేకుండా తిరుగుతున్న ద్విచక్ర వాహనదారులకు, ఆటో డ్రైవర్లకు జరిమానా విధించారు.

● ఆక్రమణలు తొలగింపు: నగరంలో ట్రాఫిక్‌కు అంతరాయం కల్పిస్తూ రోడ్డును ఆక్రమించి వ్యాపారాలు నిర్వహిస్తున్న పలు దుకాణాల యజమానులపై ట్రాఫిక్ పోలీసులు కేసు నమోదు చేశారు. చెన్నమ్మ సర్కిల్ సమీపంలో టిఫిన్ బండ్లు, బజ్జీల బండ్లు, మొబైల్ క్యాంటీన్లు ఏర్పాటు చేసి వ్యాపారాలు నిర్వహిస్తున్నందున ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తుండటంతో ట్రాఫిక్ సీఐ గౌతమి ఆధ్వర్యంలో వారికి కౌన్సెలింగ్ ఇచ్చారు.

ప్రతి పాఠశాలలో భారత్ స్కౌట్స్ గైడ్స్ యూనిట్ ఏర్పాటు చేయాలి

కర్నూలు(ఎడ్యుకేషన్), జూలై 3: జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల్లో భారత్ స్కౌట్స్, గైడ్స్ యూనిట్లను ఏర్పాటు చేయాలని జిల్లా విద్యాశాఖ అధికారి శామ్యూల్ బుధవారం తెలిపారు. 2024-25 విద్యా సంవత్సరానికి గాను భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ క్యాలెండర్ అమలులో భాగంగా జూలై 4 నుంచి 8వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులను పాత యూనిట్ల పునరుద్ధరణ, కొత్త యూనిట్లు నమోదు చేసుకునేలా ఉప విద్యాశాఖ అధికారులు, మండల విద్యాశాఖ అధికారులు పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు తెలిపారు. రిజిస్ట్రేషన్ ఫీజులు ప్రతి పాఠశాలకు, కళాశాలలకు వర్తిస్తాయన్నారు. సీయూబీ-బుబుల్ రిజిస్ట్రేషన్ ఫీజు రూ.211లు, స్కౌట్స్ అండ్ గైడ్స్ రూ.381, రోవర్స్ అండ్ రేంజర్స్ 301 ఫీజులు ఖరారయ్యాయని అన్నారు. జిల్లాలోని డిప్యూటీ ఎడ్యుకేషన్ అధికారులు, మండల విద్యాధికారులు, పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ఒక టీచరు చేత రిజిస్ట్రేషన్ ఫీజుల మొత్తం చెల్లించి రశీదును పొందాలన్నారు. వివరాల కోసం ఏఎస్‌వోసీఎల్ ఈవో ఆంథోని సెల్ 9701774556 లో సంప్రదించాలన్నారు.

6న జిల్లా పరిషత్ స్థాయి సంఘాల సమావేశాలు

కర్నూలు(న్యూసిటీ), జూలై 3: జిల్లా పరిషత్ స్థాయి సంఘాల సమావేశాలు 6న నిర్వహించనున్నట్లు జడ్పీ సీఈఓ జి. నాసరరెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా పరిషత్‌లోని మినీ సమావేశ భవనంలో ఏడు స్థాయి సంఘ సమావేశాలు నిర్వహించేందుకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తిచేసారని ఆయన తెలిపారు. ఉదయం 10 గంటల నుండి 10.30 గంటల వరకు 2వ స్థాయి సంఘం, 10.30 నుండి 11.00 గంటల వరకు 3వ స్థాయి సంఘం, 11.00 గంటల నుండి 11.30 గంటల వరకు 6వ స్థాయి సంఘం, మధ్యాహ్నం 11.30 నుంచి 12.00 గంటల వరకు 4వస్థాయి సంఘం, 12.00 నుంచి 12.30 వరకు 5వ స్థాయి సంఘం, 12.30 నుంచి 1.30 వరకు 1, 7వ స్థాయి సంఘాల సమావేశాలు నిర్వహించనున్నట్లు సీఈఓ పేర్కొన్నారు. సమావేశాలకు కొత్తగా ఎన్నికైన ఎంపిలు, ఎమ్మెల్యేలు హాజరవుతారని ఆయన తెలిపారు.

జేసీని కలిసిన ఇంటర్ బోర్డు అధికారులు

కర్నూలు(ఎడ్యుకేషన్), జూలై 3: నూతనంగా జిల్లా వృత్తి విద్యాధికారిగా బాధ్యతలు చేపట్టిన వై.పరమేశ్వరరెడ్డి, ఆర్ఐవో ఎస్‌వీఎస్ గురువయ్యశెట్టిలు మర్యాదపూర్వకంగా జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్యను కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. అనంతరం జిల్లాలో ఇంటర్మీడియట్ కళాశాలలో జరుగుతున్న సమస్యలను ఆమె దృష్టికి తీసుకెళ్లారు.

రైతులతో తహసీల్దార్ కార్యాలయం కిటకిట

సి.బెళగల్, జూలై 3: బ్యాంక్ రుణాల దరఖాస్తు ఫారాలపై సంతకాల కోసం వచ్చిన రైతులతో బుధవారం తహసీల్దార్ కార్యాలయం కిటకిటలాడింది. ఈసందర్భంగా తహసీ ల్దార్ అనుపమ మాట్లాడుతూ బ్యాంక్ రుణాల ఫారాలపై వీఆర్వోలు సంతకాలు చేయాలన్నారు.

ప్రైవేటు కళాశాలల్లో ఫీజులను నియంత్రించాలి


ఆర్ఐవో కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న విద్యార్థి సంఘం నాయకులు

కర్నూలు(ఎడ్యుకేషన్), జూలై 3: జిల్లాలోని ప్రైవేటు, కార్పొరేట్ కళాశాలల్లో ఫీజులను నియంత్రించాలని పీడీఎస్‌యూ రాష్ట్ర కార్యదర్శి రాజేష్, డీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు శరత్ కుమార్ డిమాండ్ చేశారు. పీడీఎస్‌యూ, డీఎస్‌యూ విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో బుధవారం స్థానిక జిల్లా ఇంటర్మీడియట్ బోర్డు కార్యాలయం ఎదుట విద్యార్థులు ధర్నా చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిబంధనలకు విరుద్ధంగా వివిధ రకాల ఫీజుల పేరుతో విద్యార్థుల నుంచి వసూలు చేస్తున్నారని ఆరోపించారు. అనంతరం డీఈవో పరమేశ్వరరెడ్డి, ఆర్ఐవో ఎస్‌వీఎస్ గురువయ్యశెట్టికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో విద్యార్థి సంఘం నాయకులు రాజు, అఖిల్, విజయ్‌శేఖర్, వెంకటేశ్ పాల్గొన్నారు.

నాసాలో శ్రీచైతన్య విద్యార్థుల ప్రతిభ


ప్రతిభ కనబర్చిన విద్యార్థులతో ప్రిన్సిపాల్, ఆర్ఐ

కర్నూలు(ఎడ్యుకేషన్), జూలై 3: శ్రీనగర్ కాలనీలోని శ్రీచైతన్య పాఠశాలకు చెందిన 32 మంది విద్యార్థులు నాసా ప్రవేశానికి ఎంపికయ్యారని, అందులో 8 మంది విద్యార్థులు అంతర్జాతీయ స్థాయిలో తృతీయ బహుమతిని కైవసం చేసుకున్నట్లు ప్రిన్సిపాల్ సుహాసిని బుధవారం తెలిపారు. విద్యార్థులనుద్దేశించి శ్రీచైతన్య పాఠశాలల ఏజీఎం సురేష్ మాట్లాడుతూ విద్యార్థులకు నాసా పంపిన షీల్డ్‌లు, మెడల్స్, సర్టిఫికెట్లను అందజేసి అభినందించారు. విద్యార్థులను అంతరిక్ష పరిశోధన రంగంలో విజ్ఞాన అభివృద్ధి సాధించడానికి నాసా కార్యక్రమాలు ఎంతగానో తోడ్పడు తాయన్నారు. కార్యక్రమంలో సిల్వర్ జూబ్లీ డిగ్రీ కళాశాల కెమిస్ట్రీ అధ్యాప కులు బంగారు బాబు, విజయదుర్గ డిగ్రీ కాలేజీ ఫౌండర్ సూర్యనారాయణ, శ్రీచైతన్య పాఠశాల ఆర్ఐ రామాంజనేయులు, కో-ఆర్డినేటర్ నాగేశ్వరరావు, డీన్ మహ్మద్ హుశేన్, ఇన్‌చార్జి స్వాతి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి ఆర్చరీ పోటీలకు విద్యార్థి ఎంపిక


విద్యార్థికి మెడల్‌ను అందజేస్తున్న ప్రిన్సిపాల్

కర్నూలు(ఎడ్యుకేషన్), జూలై 3: విజయవాడలో గత నెలలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి ఆర్చరీ అండర్-10 విభాగం పోటీల్లో విద్యార్థి వై.విమల్ కుమార్ పాల్గొని చక్కని ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ఓరియన్ పాఠశాల ప్రిన్సిపల్ ఈవీ రమణ బుధవారం తెలిపారు. జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక కావడంతో విద్యార్థి తల్లిదండ్రుల కృషి ఎంతో ఉందని తెలిపారు. జాతీయ స్థాయిలో జరిగే పోటీల్లో విజయం సాధించాలని ఆశాభావం వ్యక్తం చేశారు.

పండ్ల తోటల సాగుపై దృష్టి సారించండి


పండ్ల మొక్కను పరిశీలిస్తున్న డ్వామా పీడీ

ఓర్వకల్లు, జూలై 3: పండ్ల తోటల సాగుపై రైతులు దృష్టి సారించాలని డ్వామా పీడీ అమర్నాథ్ రెడ్డి సూచించారు. బుధవారం మండలంలోని గుడుంబాయి తండా గ్రామంలో ఉపాధి హామీ పథకం ద్వారా బుద్దిబాయి రెండెకరాల పొలంలో 140 మామిడి మొక్కలను, తిరుపాలుబాయి నాలుగెక రాల్లో 280 నాటిన మామిడి మొక్కలను పరిశీలించారు. ఏపీవో కుమారసాయినాథ్, టీఏలు ఎఫ్ఏలు పాల్గొన్నారు.

సి.బెళగల్: పండ్లతోటల సాగుపై రైతులు దృష్టి పెట్టాలని ఏపీవో లక్ష్మన్న రైతులు సూచించారు. బుధవారం మండలంలోని ఇనగండ్ల, గుండ్రేవుల, కొండాపురం గ్రామాల్లోని రైతులతో ఏపీవో లక్ష్మన్న మాట్లాడారు.

నేడు విద్యాసంస్థల బంద్: ఏఐఎస్ఎఫ్

కోడుమూరు, జూలై 3: నీట్ యూజీసీనెట్ పరీక్ష లీక్‌ను నిరసిస్తూ కేజీ నుంచి పీజీ వరకు గురువారం విద్యాసంస్థలు బంద్ నిర్వహిస్తున్నామని, ఇందుకు యాజమాన్యం సహకరించాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి రంగస్వామి కోరారు. స్థానిక సీపీఐ కార్యాలయంలో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ స్థాయి పరీక్ష నిర్వహించడంలో నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ విఫలమైందన్నారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు కిషోర్, మహేష్, సిద్దు పాల్గొన్నారు.

రీ-సర్వే భూములకు అడంగల్ లాక్

- ఆన్‌లైన్‌లో లభ్యం కాని 1-బీ అడంగల్
- రుణాలు ఇచ్చేందుకు నిరాకరిస్తున్న బ్యాంకర్లు
- ఇబ్బందుల్లో రైతులు
- ఏమి చేయలేమని చేతులెత్తేసిన అధికారులు



1-బీ, అడంగల్లు మంజూరు



ఆలూరు, జూలై 3: గత వైసీపీ ప్రభుత్వం చేపట్టిన భూ-రీసర్వే రైతులను ఇబ్బందులకు గురి చేస్తుంది. ఆన్‌లైన్‌లో అడంగల్, సైట్ లాక్ కావడంతో డిజిటల్ సంతకంతో కూడిన సర్టిఫికేట్లు రాకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

● రుణాలు ఇచ్చేందుకు నిరాకరిస్తున్న బ్యాంకర్లు

ఖరీఫ్ సీజన్ ఆరంభం కావడంతో రైతులు పంటలు సాగు చేయడానికి రుణాల కోసం బ్యాంక్‌లకు వెళ్తే ఖచ్చితంగా 1-బీ అడంగల్ ఇవ్వాలని నిబంధనలు విధిస్తుండటంతో రైతులు ఏమి చేయాలో తెలియక తహసీల్దార్ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. ప్రభుత్వం ఆలూరు మండలంలోని మూసనహళ్లి, కాత్రికి, కమ్మరచేడు, ముద్దనగేరి, కరిడిగుడ్డెం, మనేకుర్తి గ్రామాల్లో చేపట్టింది. ఆ గ్రామాల రైతులు కాక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

● ప్రభుత్వమే నిర్ణయం తీసుకోవాలంటూ చేతులెత్తేసిన అధికారులు

భూములు రీ-సర్వే జరగడంతో ప్రభుత్వ వెబ్‌సైట్‌లోనే 1-బీ అడంగల్ లాక్ పడింది. రైతులు కూడా సమస్యను తమ దృష్టికి తీసుకు వస్తున్నారని ప్రభుత్వమే ఈ విషయం పై నిర్ణయం తీసుకోవాలని ఆలూరు తహసీల్దార్ చంద్రశేఖర్ అన్నారు. రుణాలు రీ-షెడ్యూల్‌కు 1-బీ అడంగల్ అవసరం లేదని, కొత్త రుణాలకు మాత్రమే అవసరం అన్నారు. అయితే బ్యాంక్ అధికారులు మాత్రం తప్పనిసరి అంటుండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. అవసరం అనుకుంటే మీ-సేవ కేంద్రాల్లో మీ-భూమిలో మ్యానువల్ తీసుకొని వీఆర్‌తో సంతకం చేసుకుంటే సరిపోతుందని రెవెన్యూ అధికారులు చెబుతున్నా బ్యాంకర్లు మాత్రం అంగీకరించడం లేదు. ప్రభుత్వం త్వరగా ఈ సమస్యను పరిష్కరించాలని రైతులు కోరుతున్నారు.

మార్కెట్ కమిటీ అభివృద్ధికి ప్రణాళిక

● ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి

ఆదోని (అగ్రికల్చర్), జూలై 3: రాష్ట్రంలోనే చరిత్ర కలిగిన ఆదోని మార్కెట్ కమిటీ అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళిక రూపొందిస్తామని ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి అన్నారు. బుధవారం మార్కెట్ యార్డు లోని కమిషన్ ఏజెంట్స్ అసోసియేషన్ కార్యాలయంలో కమిషన్ ఏజెంట్స్, గుమాస్తాలతో సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏ సమస్య వచ్చినా నేరుగా తమ వద్దకు రావచ్చన్నారు. వ్యయప్రయాసాలకోరి పంటను విక్రయానికి తెచ్చిన రైతులకు గిట్టుబాటు ధర కల్పించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. కమిషన్ ఏజెంట్స్ తమ వద్దకు వచ్చే రైతులకు ఏరోజుకు, ఆరోజు చెల్లింపులు జరపాలన్నారు. వేరుశనగ వ్యాపారంలో ఇబ్బందులు ఉన్నాయని తన దృష్టికి వచ్చిందన్నారు. కేంద్ర ప్రభుత్వ నిధులతో ఎస్సీ, ఎస్టీ, బీసీ ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు ముందుకు వస్తే, కోల్డ్ స్టోరేజి నిర్మాణానికి రాయితీ వచ్చేలా చూస్తామని పేర్కొన్నారు. మార్కెట్ యార్డు కార్యదర్శి రామ్మోహన్ రెడ్డి, కమిషన్ ఏజెంట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు చంద్రకాంత్ రెడ్డి, బత్తిన లక్ష్మీనారాయణ, టీడీపీ, జనసేన నాయకులు గుడిసె కృష్ణమ్మ, మల్లప్ప, శ్రీకాంత్ రెడ్డి, గుడిసె శ్రీరాములు, రాజాగౌడ్, బ్రహ్మయ్య పాల్గొన్నారు.

ఐనేకల్లులో తాగునీటి ఎద్దడి

ఆస్పరి, జూలై 3: ఐనేకల్ గ్రామంలో తాగునీటి ఎద్దడి నెలకొంది. ఏడాది కాలంగా తాగునీటి సమస్యతో సతమతమవుతున్నా సంబంధిత ఆర్‌డబ్ల్యూఎస్, గ్రామ పంచాయతీ అధికారులు పట్టించుకోవడం లేదని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సుమారు 2వేల జనాభా ఉన్న గ్రామానికి తాగునీటి పథకం మంజూరు చేయలేదు. ఎప్పుడో వేసిన బోరునీటితోనే దాహం తీర్చుకుంటున్నారు. రోజూ గ్రామానికి వెలుపల ఉన్న బోరువద్దకు వెళ్లి నీటిని తెచ్చుకుంటున్నారు. గ్రామంలో త్రీ-ఫేస్ కరెంట్ ఉన్నప్పుడు మాత్రమే తాగునీరు సరఫరా అవుతోంది. వర్షాలు లేక భూగర్భ జలాలు అడుగంటి పోవడంతో అరకొర నీటితోనే దాహం తీర్చుకుంటున్నారు. ఎన్నికల ముందు రాజకీయ నాయకులు ఇచ్చిన హామీ మేరకు తాగునీటి సౌకర్యం కల్పించాలని గ్రామస్థులు కోరుతున్నారు.

ఆదోని ఫొటోగ్రాఫర్‌కు పురస్కార నంది అవార్డు

ఆదోని టౌన్, జూలై 3: ఆదోని పట్టణానికి చెందిన సీనియర్ ఫొటోగ్రాఫర్ రమేష్ చంద్ర షా మన కళాక్షేత్ర ఫౌండేషన్ (హైదరాబాద్) వారి నుంచి పురస్కార నంది అవార్డును బుధవారం అందుకున్నారు. వివిధ రంగాలలో తమ ప్రతిభను చాటిన వారిని గుర్తించి పురస్కార నంది అవార్డులను అందించే మన కళాక్షేత్ర ఫౌండేషన్ వారు 2024కు ఫొటోగ్రాఫిలో విశేష ప్రతిభను కనబరిచిన రమేష్ చంద్ర జె షాను ఎంపిక చేసి అవార్డును అందించారు. "ఆత్మ ఉందా....? లేదా..?" అనే ఒక తెలుగు మూవీకు స్టిల్ ఫొటోగ్రాఫర్‌గా పనిచేయడం ఈ అవార్డు ఎంపికలో కలిసి వచ్చిందని, ఫొటోగ్రఫీ వంశానికి చెందిన తనకు అవార్డు లభించడం ఆనందంగా ఉందని రమేష్ చంద్ర జేషా తెలిపారు.

కాలం చెల్లిన బస్సుల్లో విద్యార్థులను తీసుకెళ్లొద్దు

ఆదోని రూరల్, జూలై 3 : కాలం చెల్లిన బస్సుల్లో విద్యార్థులను తీసుకెళ్లొద్దని రూరల్ సీఐ నీరంజన్ రెడ్డి, ఎస్ఐ ఎర్రిస్వామి సూచించారు. బుధవారం ఆదోని - ఎమ్మిగనూరు బైపాస్‌లోని ఆంజనేయ స్వామి విగ్రహం వద్ద ప్రైవేట్ పాఠశాల, కాలేజీలకు సంబంధించిన విద్యార్థుల బస్సులను వారు తనిఖీ చేసి వాహనాల పత్రాలను పరిశీలించారు.

బ్రాహ్మణుల సంక్షేమానికి కృషి

ఎమ్మిగనూరు, జూలై 3: బ్రాహ్మణుల సంక్షేమానికి తమవంతు కృషి చేస్తానని ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి అన్నారు. బుధవారం ఎమ్మెల్యేను ఆయన నివాసంలో బ్రాహ్మణ కార్పొరేషన్ మాజీ డీఎల్‌వో గురురాఘవేంద్రరావు ఆధ్వర్యంలో సంఘం నాయకులు ఎమ్మెల్యేను కలిసి ఘనంగా సన్మానించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ బ్రాహ్మణుల సంక్షేమానికి టీడీపీ ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. సంఘం నాయకులు రఘునందన్, వాసుదేవాచార్, నరహరిశాస్త్రీ, అనీల్ స్వామి, పవన్‌స్వామి, దత్తాత్రేయశర్మ, మూర్తి, మణికంఠస్వామి తదితరులు పాల్గొన్నారు.

మహిళా కార్యకర్త మృతి పార్టీకి తీరనిలోటు

పెద్దకడుబూరు, జూలై 3: టీడీపీ మహిళా కార్యకర్య ఉరుకుందమ్మ మృతి పార్టీకి తీరనిలోటు అని టీడీపీ నాయకులు సత్యన్నగౌడు, రంగన్న, జనార్దన్ అన్నారు. బుధవారం మండల పరిధిలోని హెచ్. మురవణి గ్రామంలో టీడీపీ మహిళా కార్యకర్త ఉరుకుందమ్మ మృతి చెందింది. విషయం తెలుసుకున్న టీడీపీ నాయకులు ఆమె మృతదేహాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం మట్టి ఖర్చులకు రూ.5వేల నగదును అందజేశారు. టీడీపీ నాయకులు చెన్నకేశవ, శివ, నరసింహులు, రామలింగ, రాంమూర్తి, గోవిందు పాల్గొన్నారు.

గోనెగండ్లలో సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం



సీఎం చంద్రబాబు చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న దివ్యాంగులు

గోనెగండ్ల, జూలై 3: సీఎం చంద్రబాబు నాయుడు ఎన్నికల హామీకి కట్టుబడి పింఛన్‌ను రెండింతలు పెంచి మాట నిలబెట్టు కున్నారని కీర్తిస్తూ దివ్యాంగుల సంఘం ఆధ్వర్యంలో సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు సోమన్న, జిల్లా మహిళావిభాగం అధ్యక్షురాలు శేషమ్మ కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు దివ్యాంగులకు చేసిన మేలును వారు గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో సుంకన్న, మహబూబ్‌బాషా, మునిస్వామి, మహాదేవ్, అబ్దుల్, నరసింహులు, కడియాల వెంకటేశ్వర్లు గుంటెప్ప, నాగరాజు పాల్గొన్నారు.

రేపు సంపూర్ణ అభియాన్‌కు కలెక్టర్ రాక

మద్దికెర, జూలై 3: మండల కేంద్రంలో ఈ నెల 5వ తేదీన కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన సంపూర్ణ అభియాన్ కార్యక్రమానికి కలెక్టర్ పి.రంజిత్‌బాషా రానున్నారని ఎంపీడీవో అలివేలమ్మ తెలిపారు. మంగళవారం ఆమె మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నీత్ అయోగ్ అభియాన్‌లో భాగంగా మండలంలోని 12 ప్రభుత్వ శాఖలతో కలిసి సమావేశం ఉన్నట్లు తెలిపారు. విద్యుత్, వ్యవసాయ శాఖ, హౌసింగ్, ఉపాధి, ఐకేపీ, విద్యా, ఆరోగ్యాశాఖ, వెటర్నిటి, ఐసీడీఎస్ వంటి శాఖలకు చెందిన అధికారులు పాల్గొంటారని అన్నారు. ప్రతి అధికారి నివేదికలతో ఈ కార్యక్రమానికి హాజరు కావాలని పేర్కొన్నారు.

వైభవంగా ద్వాదశి వేడుకలు

మంత్రాలయం, జూలై 3 : రాఘవేంద్ర స్వామి మఠంలో ద్వాదశి వేడుకలు వైభవంగా జరిగాయి. మఠం పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థుల ఆశీస్సులతో తెల్లవారుజాము నుంచే రాఘవేంద్ర స్వామి మూల బృందావనంకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేద పండితుల మంత్రోచ్చరణాలు, మంగళ వాయిద్యాల మధ్య నవరత్నాల రథం పై వజ్రాలు పొదిగిన ప్రహ్లాదరాయులను అధిష్ఠించి పీఠాధిపతి మహా మంగళహారతితో ఆలయ ప్రాంగాణం చుట్టూ ఊరేగించారు.



స్వర్ణ రథంపై ఊరేగుతున్న ప్రహ్లాదరాయులు

ఐదేళ్లలో 2కి.మీ సీసీ రోడ్డా..!

- అవాక్కైన ఎమ్మెల్యే బీవీ
- ఎమ్మిగనూరు మండల స్థాయి అధికారులతో సమీక్ష సమావేశం



ఐ లవ్ ఎమ్మిగనూరు బోర్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బీవీ

ఎమ్మిగనూరు రూరల్, జూలై 3: వైసీపీ ఐదేళ్ల పాలనలో ఎమ్మిగనూరు మండలంలో కేవలం రెండు కి.మీ మాత్రమే సీసీ రోడ్డు వేశారని పంచాయతీరాజ్ అధికారి తెలపడంతో ఒక్కసారిగా ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి అవాక్కయ్యారు.. ఇదేమి చోద్యం. .ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వం వేసింది రెండు కిలోమీటర్ల రోడ్డేనా అంటూ అధికారులను ప్రశ్నించారు. బుధవారం స్థానిక ఎంపీపీ సమావేశ భవనంలో ఎమ్మిగనూరు వివిధ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ముందుగా పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో మండలంలో చేపట్టిన పనులపై ఆరా తీశారు. ఈ సందర్భంగా పీఆర్ ఏఈ శంకర్ ఐదేళ్ల కాలంలో 147పనులు జరిగాయని, ఇందులో పీఆర్ నిధులతో రెండు కి.మీ రోడ్డు మాత్రమే వేశామని తెలిపారు. ఐదేళ్ల కాలంలో మిగతా నిధులు ఏమయ్యాయని ప్రశ్నించారు. ఆర్‌డబ్ల్యూఎస్‌పై సమీక్ష నిర్వహిస్తూ మండలంలో ఏ గ్రామానికి వెళ్లినా విపరీతంగా తాగునీటి సమస్య ఉందని ఫిల్టర్ చేయకుండా తాగునీటిని సరఫరా చేస్తున్నారని, ఆర్‌డబ్ల్యూఎస్ శాఖ అధికారులు ఏమి చేస్తున్నారని నిలదీశారు. అనంతరం గుడికల్లు గ్రామాభివృద్ధికి ఏ మేరకు నిధులు మంజూరయ్యాయని, ఏ పనులు చేపట్టారని ఈవోపీఆర్డీ విజయలక్ష్మిని ప్రశ్నించారు. గ్రామానికి రూ.3.60 కోట్ల నిధులు వచ్చాయని, అయితే, ఏఏ పనులకు ఎంతెంత మేర నిధులు వెచ్చించిన వివరాలను చెప్పలేకపోయారు. దీంతో ఎమ్మెల్యే పూర్తిస్థాయిలో రెండు మూడు రోజుల్లో విచారిస్తామన్నారు. విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన పనులపై ఆరా తీశారు. సమావేశానికి డీఈ హాజరు కాకపోవడంపై అసహనం వ్యక్తం చేశారు. అనంతరం ఐసీడీఎస్, విద్యా, వైద్య శాఖలపై సమీక్షించారు. ఎంపీడీవో కొండన్న, డిప్యూటి తహసీల్దార్ రఘువీర, డీఈ సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.

ఐ లవ్ ఎమ్మిగనూరు బోర్డును ప్రారంభించిన ఎమ్మెల్యే బీవీ

స్థానిక అన్నమయ్య సర్కిల్‌లో మున్సిపాలిటి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఐ లవ్ ఎమ్మిగనూరు బోర్డును ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి ప్రారంభించారు. అనంతరం మండల పరిధిలోని ఆయా గ్రామ పంచాయతీలకు మంజూరైన ట్రాక్టర్లను ప్రారంభించి వాటిని కొంతదూరం నడిపారు. కమిషనర్ గంగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సాహిత్యం జీవితాన్ని ఉన్నతీకరిస్తుంది

● అరసం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వల్లూరు శివప్రసాద్

ఆదోని (అగ్రికల్చర్), జూలై 3: సాహిత్యం జీవితాన్ని ఉన్నతీకరిస్తుందని అరసం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వల్లూరు శివప్రసాద్ అన్నారు. బుధవారం అక్షరశ్రీ కళాశాలలో ఆయన మాట్లాడారు. విద్యార్థుల్లో, యువకుల్లో శాస్త్రీయ దృక్పథం కొరవడుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. సాహిత్యాన్ని అధ్యయనం చేయడం ద్వారా వారిలో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించవచ్చన్న ఆలోచనతో, అభ్యుదయ రచయితల సంఘం విద్యార్థి యువకులను చైతన్యం కలిగించడానికి ఇలాంటి సాహితీ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. మతవిద్వేషాల పట్ల గాని, రాజకీయ అవినీతి గాని యువత విద్యార్థులు ప్రశ్నించాల్సిన అవసరాన్ని సాహిత్యం నొక్కి చెబుతుందని అన్నారు. అందుకే పుస్తకాల పఠనం, సాహిత్య అధ్యయనం ప్రతి ఒక్కరూ అలవర్చుకోవడం ద్వారా ఉన్నతమైన సమాజాన్ని తీర్చిదిద్దవచ్చని పిలుపునిచ్చారు. అనంతరం అరసం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వల్లూరు శివప్రసాద్‌ను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ప్రముఖ కవయిత్రులు స్వయంప్రభ, నాగజ్యోతి, కవి కేసీ మల్లికార్జున, ఎస్టీయూ రాష్ట్ర కౌన్సిలర్ జీ వీరచంద్ర యాదవ్, పట్టణ ప్రధాన కార్యదర్శి భీమరాజు, నాగేంద్ర గౌడ్ పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధితోనే రాష్ట్రాభివృద్ధి : ఎమ్మెల్యే కేఈ



లబ్ధిదారులకు మంజూరైన ట్రాక్టర్‌కు పూజ చేస్తున్న ఎమ్మెల్యే కేఈ

పత్తికొండ/తుగ్గలి, జూలై 3: గ్రామాలు అభివృద్ధి చెందితేనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు అన్నారు. స్వచ్ఛ భారత్‌కింద పత్తికొండ నియోజకవర్గంలోని నలకదొడ్డి, పందికోన, దూదేకొండ, పులికొండ, రాతన, తుగ్గలి, పగడిరాయి, చెన్నంపల్లి గ్రామ పంచాయతీలకు మంజూరైన 8ట్రాక్టర్లను బుధవారం ఎమ్మెల్యే శ్యాంబాబు పత్తికొండలో పంపిణీచేశారు. వైసీపీ హయాంలో సర్పంచులు అప్పులుచేసి పారిశుధ్యం, మెయింటెన్స్ పనులు చేయాల్సిన దుస్థితి ఉండేదని, టీడీపీ ప్రభుత్వం గ్రామాభివృద్ధిపై ప్రత్యేక దృష్టిసారిస్తుందని స్పష్టం చేశారు. అనంతరం నలకదొడ్డికి మంజూరైన ట్రాక్టర్ పంపిణీ సందర్భంగా కేఈ శ్యాంబాబు ట్రాక్టర్‌ను నడిపారు. అలాగే పత్తికొండ పట్టణంలోని పాతపేట రామాలయంలో ఎమ్మెల్యే కేఈశ్యాబాబు ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి తుగ్గలి నాగేంద్ర, బత్తినిలోక్‌నాథ్, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన ఏపీఎన్జీవోసంఘం, అంగన్‌వాడీ వర్కర్లు, డీలర్లు: ఏపీఎన్జీఓ సంఘం తాలూకాఅధ్యక్షుడు సాయిబాబా ఆధ్వర్యంలో సంఘంనాయకులు పూలమాలతో ఎమ్మెల్యేకు శుభాకాంక్షలు తెలిపారు. అలాగే అంగన్‌వాడీ వర్కర్లు ఎమ్మెల్యేను కలిసి జీతాలు పెంపుకోసం పోరాటాలుచేసినా వైసీపీ ప్రభుత్వం పట్టించుకోలేదని, తమ కష్టాలను సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. వైసీపీ ప్రభుత్వం డీలర్లను నట్టేట ముంచిందని, టీడీపీ ప్రభుత్వమైనా డీలర్ల సమస్యలు పరిష్కరించి ఆదుకోవాలని డీలర్ల సంఘం నాయకులు చంద్రశేఖర్ యాదవ్, తిమ్మప్ప యాదవ్, సుంకన్న ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబును కోరారు.

నేడు విద్యాసంస్థల బంద్

మద్దికెర, జూలై 3: విద్యార్థి సంఘాలు గురువారం తలపెట్టిన విద్యాసంస్థల బంద్‌ను విజయవంతం చేయాలని ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఎఫ్, పీడీఎస్‌యు నాయకులు రవికుమార్, శ్రీకాంత్, రంగస్వామి కోరారు. నీట్ పరీక్షను కేంద్ర ప్రభుత్వం తక్షణమే రద్దు చేయాలని, లీక్‌లకు కారణమైన ఎన్టీఏ సంస్థను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. వైద్యవిద్య కోర్సులు చదువుకునే 24 లక్షల మంది విద్యార్థులు, వారి తల్లిదండ్రులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని న్యాయం చేయాలని కోరుతూ విద్యాసంస్థల బంద్‌ను చేస్తున్నామని తెలిపారు.

భూమి రిజిస్ట్రేషన్ పత్రాలు గల్లంతుపై పోలీసులకు ఫిర్యాదు

ఎమ్మిగనూరు, జూలై 3: మండల పరిధి కే తిమ్మాపురం గ్రామానికి చెందిన ఈరమ్మ తన భూమికి చెందిన రిజిష్టర్ పత్రాలు గల్లంతయ్యాయని రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. బుధవారం ఈ మేరకు ఆమె 1998కి సంబంధించిన 5821-1998, 2012 సంబంధించిన 5093-2012 పత్రాలను వెతికించి ఇవ్వాలని ఫిర్యాదులో పేర్కొన్నారు.

హిందూ శ్మశాన వాటిక భూమిని పరిరక్షించండి

ఎమ్మిగనూరు, జూలై 3: పట్టణ శివార్లలోని కర్నూలు ప్రధాన రహదారిని ఆనుకొని ఉన్న హిందూ శ్మశానవాటిక భూమిని పరిరక్షించాలని ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డికి పరిరక్షణ కమిటీ నాయకులు కోరారు. బుధవారం నాయకులు బతకన్న, గణేష్, బీఎల్ నారాయణ, బజారి, పెద్దయ్య, రంగన్న, రామస్వామిలు ఎమ్మెల్యేను కలిసి వినతిపత్రం అందజేశారు. కొంతమంది శ్మశాన వాటిక భూమిని ఆక్రమించి నిర్మాణాలు చేపట్టారని వాటిని తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు.

సమాచారం ఇవ్వకుండానే గ్రామ సభ

కౌతాళం, జూలై 3: గ్రామ సమస్యలను ప్రజల నుంచి తెలుసుకుని వాటి పరిష్కారం కోసం నిర్వహించే గ్రామ సభను సభ్యులకు , ప్రజలకు తెలియకుండానే తూతూ మంత్రంగా నిర్వహించి అధికారులు చేతులు దులుపుకున్నారు. బుధవారం సర్పంచు పాల్‌దినకరన్ అధ్యక్షతన గ్రామ కార్యదర్శి శివప్ప సమక్షంలో గ్రామ సభను సచివాలయ సిబ్బందితో కలిసి నిర్వహించారు. ఇదేమిటనీ ప్రజలు ముక్కున వేలువేసుకొని ఆశ్చర్యం వ్యక్తం చేశారు. గ్రామంలో ముందస్తు సమచారం అందించి గ్రామ సభను నిర్వహించాలి. కనీసం విలేకరులకు కూడా ఎలాంటి సమాచారం ఇవ్వకుండా సభను మమ అనిపించడం విమర్శలకు తావిచ్చింది.

ముగిసిన గ్రామ పంచాయతీ వేలంపాటలు

పత్తికొండ, జూలై 3: పత్తికొండ మేజర్ గ్రామ పంచాయతీ వేలంపాటలు బుధవారం ముగిశాయి. మార్కెట్,ʼసంతమార్కెట్ వేలాలు ఇదివరకేపూర్తికాగా బస్టాండ్, పార్కింగ్‌కు సంబంధించిన వేలాలు వాయిదా పడ్డాయి. బుధవారం సర్పంచు కొమ్ముదీపిక ఆధ్వర్యంలో ఈవో నరసింహులు వేలంపాటలు నిర్వహించారు. పట్టణానికి చెందిన చాకలినారాయణ రూ7,32,000 వేలంపాటలో బస్టాండ్, పార్కింగ్‌కు వసూళ్ల హక్కులు పొందారు.

తాగునీటి సమస్య తీరుస్తాం

నందవరం, జూలై 3: మండల కేంద్రంలో తాగునీటి సమస్య తీరుస్తామని టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు, మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ దేశాయి మాధవరావు అన్నారు. బుధవారం మండల అధికారులతో కలసి నందవరంలోని తిమ్మరాజు కుంటను పరిశీలించారు. ఎమ్మెల్యే బీవీ జయ నాగేశ్వరరెడ్డి ఆదేశాల మేరకు ఈవోపీఆర్డీ ఈశ్వరయ్య, ఏఈ వెంకట్రాముడుతో కలిసి తిమ్మరాజుకుంటను పరిశీలించి ఇంటింటికీ కోళాయి ఇచ్చే విధంగా చూస్తామని దేశాయి మాధవరావు తెలిపారు.

అప్రెంటిస్ విధానం లేకుండా డీఎస్సీని ప్రకటించాలి

ఎమ్మిగనూరు రూరల్, జూలై 3: అప్రెంటిస్ విధానం లేకుండా డీఎస్సీని ప్రకటించాలని డీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కరెకృష్ణ, మండల అధ్యక్షకార్యదర్శులు కిరణ్, చిన్న వీరేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం పట్టణంలోని బాలికోన్నత పాఠశాల, వీవర్స్ కాలనీ, ఎస్ఎస్ఎస్, సోమప్ప నగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో డీటీఎఫ్ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో సంఘం నాయకులు పాల్గొన్నారు.

నేడు క్రిష్ణగిరికి ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు రాక

క్రిష్ణగిరి, జూలై 3: పత్తికొండ ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు గురువారం క్రిష్ణగిరికి వస్తున్నట్లు టీడీపీ మండల అధ్యక్షుడు కటారుకొండ మర్రి శ్రీరాములు బుధవారం తెలిపారు. మండల పరిషత్ సమావేశ భవనంలో జరిగే మండల సర్వసభ్య సమావేశంలో ఎమ్మెల్యే పాల్గొంటారని తెలిపారు. సార్వత్రిక ఎన్నికలలో గెలిచాక ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు మొదటిసారి మండలానికి వస్తుండటంతో తెలుగుదేశం నాయకులు, కార్యకర్తలు స్వాగతం పలికేందుకు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు.

ఆదర్శ కస్తూర్బా పాఠశాలల్లో సీట్లు పెంచేలా చూడండి

మద్దికెర, జూలై 3: స్థానిక ఆదర్శ, కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో సీట్లు పెంచేలా చూడాలని టీడీపీ జిల్లా కార్యదర్శి గూడూరు ధనుంజయుడు ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబును కోరారు. బుధవారం ఎమ్మెల్యేను కలిసి కోరగా సమస్యను జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్తానని ఎమ్మెల్యే శ్యాంబాబు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు భాస్కర్ యాదవ్ ఉన్నారు.

కోసిగిలో రెండు ఇళ్లల్లో చోరీ

కోసిగి, జూలై 3: స్థానిక సాయిబాబ గుడి కాలనీలో పక్కపక్కనే ఉన్న రెండు ఇళ్లల్లో దొంగలు బంగారు, నగదు చోరీ చేశారని బాధితులు బుధవారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కోసిగికి చెందిన దలవాయి గోవిందు, హుశేనమ్మ ఇంటికి తాళం వేసి పొలానికి వెళ్లడంతో బీరువాలో ఉన్న ఒక తులంన్నర బంగారు, రూ.20వేల నగదు, 12 తులాల వెండి చైన్లు దొంగలు దోచుకెళ్లారు. అలాగే పక్కనే ఉన్న గ్యాస్ సిలిండర్ డెలివరి బాయ్ హరికేర నర్సప్ప ఇంట్లో బీరువాలో ఉన్న రూ.50వేల నగదు, తులం బంగారు అపహరించినట్లు బాదితులు ఫిర్యాదు చేశారు.

చిక్కం జానయ్యకు ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ పదవి ఇవ్వాలి

ఆలూరు, జూలై 3: దళితుల సమస్యలపై నిరంతరం పోరాటాలు చేస్తున్న జైభీమ్ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నేత చిక్కం జానయ్యకు ఎస్సీ కమిషన్ చైర్మన్ పదవి ఇవ్వాలని ఆలూరు తాలూక అధ్యక్షుడు పీ రాజు కోరారు. బుధవారం ఆయన మాట్లాడుతూ ఆదోని డివిజన్ మంత్రాలయం మండలానికి చెందిన జానయ్య చేస్తున్న సేవలను గుర్తించాలన్నారు. ఉద్యమాలతో పాటు హెల్పింగ్ హ్యాండ్స్ యూత్ అనే స్వచ్ఛంద సంస్థను స్థాపించి పలు సేవా కార్యక్రమాలు చేపట్టారని పేర్కొన్నారు. సీఎం చంద్రబాబు నాయుడు ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్‌గా అవకాశం కల్పించి మాదిగ సామాజిక వర్గానికి గుర్తింపు ఇవ్వాలని కోరారు.

3ఏడీఎన్3 : నిరసన కార్యక్రమంలో పాల్గొన్న బీజేపీ నాయకులు

పార్లమెంట్‌లో అనుచిత వ్యాఖ్యలు సరికాదు

ఆదోని టౌన్, జూలై 3: పార్లమెంట్ సమావేశాలలో కాంగ్రెస్ పార్టీ నాయకుడు రాహుల్ గాంధీ బీజేపీ, ఆర్ఎస్ఎస్, నరేంద్ర మోదీలపై అనుచిత వ్యాఖ్యలు చేయడం ఏమాత్రం సమంజసం కాదని బీజేపీ యువ మోర్చా, విశ్వహిందూ పరిషత్, భజరంగ్ దళ్ నాయకులు అన్నారు. బుధవారం విలేకరులతో మాట్లాడుతూ మనోభావాలు దెబ్బతినేలా చేసిన వ్యాఖ్యల పై ఆయన భేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. రాహుల్ గాంధీ పై కేసు నమోదు చేసి అరెస్ట్ చేయాలని డీఎస్పీ శివనారాయణ స్వామి, రెండవ పోలీస్ స్టేషన్ సీఐ గోపికి వినతిపత్రం ఇచ్చారు.

కర్ణాటక టెట్రా ప్యాకెట్ల పట్టివేత

ఎమ్మిగనూరు టౌన్, జూలై 3 : మంత్రాలయం మండలం, కగ్గలు క్రాస్ రోడ్డు వద్ద కర్ణాటక నుంచి అక్రమంగా తరలిస్తున్న మద్యంను ఎమ్మిగనూరు సెబ్ సీ ఐ ఆధ్వర్యంలో దాడులు చేసి పట్టుకున్నారు. ఎమ్మిగనూరు సెబ్ సీఐ భార్గవ్ రెడ్డి తెలిపిన వివరాల మేరకు దెవన తిరుమలేష్, డి బెళగల్ గ్రామం, కొసిగి మండలానికి చెందిన వ్యక్తి నుంచి 960 అక్రమంగా తరలిస్తున్న మద్యంప్యాకెట్లను ఒక ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు.

లింగాయత్‌లకు కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

తుగ్గలి, జూలై 3: రాష్ట్రం లింగాయత్‌ల కార్పొరేషన్ ఏర్పాటు చేసి న్యాయం చేయాలని లింగాయత్ సంఘం రాష్ట్ర నాయకులు కాడద కౌశిక్ కుమార్ కోరారు. బుధవారం జి.ఎర్రగుడిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల్లో ప్రతి లింగాయతుడు వైసీపీకి ఎదురు నిలబడి టీడీపీ కూటమి అభ్యర్థుల గెలుపు కోసం కృషి చేశారన్నారు. చంద్రబాబుతోనే లింగాయత్‌లకు న్యాయం జరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

సంక్షిప్తం

యువతిపై అత్యాచారం - కేసు నమోదు

పెద్దకడుబూరు, జూలై 3: యువతిపై ఓ వ్యక్తి అత్యాచారానికి పాల్పడిన సంఘటన చిన్న తుంబళం గ్రామంలో చోటు చేసుకుంది. బుధవారం పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన ఓ యువతి గత నెల 28న తమ బర్రె కనిపించక పోవటంతో వెతికేందుకు వెళ్లింది. అదే గ్రామానికి చెందిన రమేష్ యువతిని పొలాల్లోకి లాక్కెళ్లి అత్యాచారానికి పాల్పడ్డాడు. దీంతో యువతి ఈనెల 2వ తేదీన పోలీసులకు ఫిర్యాదు చేసింది.

దేవనకొండలో సమస్యలు పరిష్కరించాలి

దేవనకొండ ,జూలై 3 : దేవనకొండలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని జనసేన నాయకులు జగదీష్, మల్లికార్జునరెడ్డి, ఉచ్చీరప్ప అన్నారు. తాగునీటి సమస్య పారిశుధ్య పనులు నిర్వహించాలని, బస్టాండ్ ఆవరణలో సౌకర్యాలు కల్పించాలని పంచాయతీ కార్యదర్శి అబ్దుల్ రహీంకు వినతి పత్రం ఇచ్చారు. నాయకులు శ్రీనివాస్ యాదవ్ , రామాంజినేయులు, సరోజ, హబీబా తదితరులు పాల్గొన్నారు.

వాగ్దానాలు చాలించి... అభివృద్ధి చూపించండి

ఆదోని టౌన్, జూలై 3: కూటమి అభ్యర్థిగా గెలిచిన డాక్టర్ పార్థసారథి నెల రోజులు కావస్తున్నా, ప్రతి సమావేశంలో వాగ్దానాలు మాత్రమే ఇస్తున్నారు తప్ప, అభివృద్ధి పనులను చేపట్టడం లేదని కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు దేవిశెట్టి ప్రకాష్, మైనారిటీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఎంఎండీ నూర్ అహమ్మద్ అన్నారు. బుధవారం వీరు మాట్లాడుతూ ఎమ్మెల్యే ఇక అభివృద్ధిపై దృష్టి సారించాలని సూచించారు. పట్టణంలోని దెబ్బతిన్న అన్ని ప్రధాన రహదారులకు ప్యాచ్ వర్క్ చేయించాలని కమిషనర్ రామచంద్రారెడ్డికివినతిపత్రం అందించారు.

తాగునీటి సమస్య తలెత్తకుండా చూడండి : విరుపాక్షి

ఆలూరు, జూలై 3: నియోజకవర్గంలో తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలని ఆలూరు ఎమ్మెల్యే బీ విరుపాక్షి ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులకు సూచించారు. బుధవారం ఆలూరు ఆర్అండ్‌బీ అతిథి గృహంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. నియోజకవర్గంలో 16 రోజులకు ఒక్కసారి నీటి సరఫరా అవుతోందని పత్రికల్లో వస్తున్నా.. అధికారులు ఎందుకు పట్టించుకోవడం లేదని ప్రశ్నించారు. సమస్యలు పునరావృతం కాకుండా చూడాలని సూచించారు. వైసీపీ నాయకులు అరికెర వెంకటేశ్వర్లు, మాదన్న, అరికర వీరేష్ పాల్గొన్నారు.

దళితుల పై దాడిచేసిని వారిని శిక్షించాలి

గోనెగండ్ల, జూలై 3: దళితులపై దాడికి పాల్పడిన వారిని వెంటనే శిక్షించాలని కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు కరుణాకర్ డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట కేవీపీఎస్ ఆధ్వర్యంలో నిసరన తెలిపారు. అనంతరం తహసీల్దార్ పార్వతికి వినతి పత్రం అందజేశారు. వెల్దుర్తి మండలం రత్నపల్లి గ్రామంలోని నిరుపేద దళితులైన గురిగింజ అనుమక్క, రామాంజినేయులు, పెద్దరాముడుపై అదే గ్రామానికి చెందిన అగ్రవర్ణాల వారు కులం పేరుతో దూషిస్తూ దాడికి పాల్పడిన వారిపై ఎస్సీ, ఎస్టీ, కేసు నమోదు చేసి వారిని వెంటనే శిక్షించాలని డిమాండ్ చేశారు. దాడి జరిగి 14 రోజులు అయినప్పటికీ దాడికి పాల్పడిన వారిపై ఇప్పటి వరకు కేసు నమోదు చేయక పోవడం దారుణమని పేర్కొన్నారు.

మోటారు సైకిల్ నుంచి పడి మహిళ మృతి

మంత్రాలయం, జూలై 3: మాలపల్లి గ్రామానికి చెందిన కౌసర్ భాను (37) మోటారు సైకిల్‌పై నుంచి కింద పడి గాయాలపాలై చికిత్స పొందుతూ మృతి చెందింది. మాధవరం హెడ్ కానిస్టేబుల్ వీరేష్ తెలిపిన వివరాల మేరకు బుధవారం మాలపల్లి నుంచి ఆమె తమ్ముడు మహ్మద్ ఫాషా పెళ్లి చూపులకు కర్ణాటకలోని ఎరిగేరిలో కార్యక్రమం ముగించుకుని తిరిగి మాలపల్లికి వస్తుండగా.. రచ్చుమర్రి గ్రామం దాటిన తర్వాత కౌసర్‌బానుకు ఫిట్స్ (మూర్ఛవ్యాధి) రావడంతో మోటారు సైకిల్ నుంచి కింద పడి తలకు తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స కోసం ఆదోని ఆసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం కర్నూలు ఆసుపత్రికి తరలిస్తుండగా.. ఆదోని-ఎమ్మిగనూరు మార్గమధ్యలో మృతి చెందింది.

'అధైర్యపడొద్దు.. అండగా ఉంటా '

మంత్రాలయం, జూలై 3: నియోజకవర్గంలో టీడీపీ కార్యకర్తలకు ఏ సమస్య వచ్చినా అధైర్యపడొద్దని, అండగా ఉంటాననీ టీడీపీ నాయకుడు ఎన్.రాఘవేంద్రరెడిద్డ అన్నారు. బుధవారం మాధవరంలోని తన నివాసంలో రైతులు, ఉద్యోగస్థులు, టీడీపీ నాయకులు, ఆటో డ్రైవర్లుతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ కోసం పని చేసిన ప్రతి కార్యకర్తకు న్యాయం జరిగేలా చూసుకుంటానన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటైన వెంటనే పింఛన్‌ను రూ.4వేలకు పెంచి సీఎం చంద్రబాబు మాట నిలబెట్టుకున్నారని అన్నారు. సమావేశంలో టీడీపీ నాయకులు రఘునాథరెడ్డి, రామక్రిష్ణారెడ్డి, రాకేష్ రెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి చావిడి వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.